RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



10 ఏప్రిల్ 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:266

# మోడీ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

## తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వం

## సీడబ్ల్యూసీ భేటీలో సీఎం రేవంత్




ప్రధాని మోడీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారం లోకి రానీయ్యబోమని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం అహ్మదాబాద్ లో నిర్వహించిన సీడబ్ల్యూసీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..."మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల గడ్డపైన, సబర్మతీ నది ఒడ్డున రెండు రోజులుగా మనం మేథో మదన (చింతన్ బైఠక్) సదస్సు జరుపుకుంటున్నాం. అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మోదీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున మనం ఇక్కడ సమావేశమయ్యాం..గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో మనం ప్రయత్నిస్తున్నాం. గాడ్సేఆలోచన విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారు..

గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబ సభ్యులు, రాహుల్ గాంధీ గారి మిత్రులు, దేశ నలుమూలల ఉన్న ప్రతి ఒక్కరూ మోదీకి వ్యతిరేకంగా పోరాడాలి..మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారు.. వాటికి వ్యతిరేకంగా రైతులు 14 నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదు..మోడీ మణిపూర్‌లో మంటలు రాజేశారు.. దేశ మూల వాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం మోదీ చేశారు. మరోవైపు, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు..కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు కుల గణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి రాహుల్ గాంధీ హామీలు ఇచ్చారు..రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశాం. మేం తెలంగాణలో కుల గణన చేసి చూపించాం. ఈ గణనపై రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడాతారనే భయంతో ఆయనకు లోక్‌సభలో మోదీ మైక్ ఇవ్వ లేదు...ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. పదకొండు సంవత్సరాలు దాటిపోయింది.. ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలి...మోదీ, అమిత్ షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయి...ప్రతి ఏటా 2 కోట్ల యువకులకు ఉద్యోగాలు రాలేదు...దేశంలోని మూలమూలన ఉన్న గాంధేయవాదులు మోదీ వ్యతిరేక పోరాటంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నా...గాంధీ ఆలోచనధారతో ఉన్న మనమంతా గాడ్సే వారసులను, మోదీని ఓడించాలి. రైతులు, యువత, మహిళల కోసం సీడబ్ల్యూసీలో సాగిన చర్చలపై ఆశతో నేను ఇక్కడి నుంచి వెనక్కు వెళుతున్నా... తెలంగాణలో మేం బీజేపీకి అవకాశం ఇవ్వం... గుజరాత్ గడ్డపై నుంచి నేను చెబుతున్నా.. మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో మాకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది...మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వకమైన బంధం ఉంది..మాకు స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇచ్చారు.. తెలంగాణను మాకు సోనియా గాంధీ అందించింది. వల్లభాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒక్కటే చెబుతున్నా... సోనియా గాంధీ నాయకత్వంలో మేం బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం. బీజేపీని అడ్డుకుంటాం.. వారిని ఎవరూ క్షమించరు..గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేశారు.. .కానీ బ్రిటిష్‌వాళ్లు ఎప్పుడూ గాంధీజీ మీద లాఠీ ప్రయోగం చేయలేదు.స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారు.బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులు... బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలి. మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్దంగా ఉండాలి.. తెలంగాణలో బీజేపీని అడ్డుకునేందుకు, ఓడించేందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకొని వెళుతున్నాం...రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకొని వెళ్లాలని నా విజ్ఞప్తి" అని సీఎం తెలిపారు.

## రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్బీఐ

ముంబై ఏప్రిల్ 9 : ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఇవాళ ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపో రేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు తగ్గించడం వల్ల .. బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది.దీని వవల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటును 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు.

# వేములవాడ మండల పరిధిలో పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.

ముఖ్యఅతిథిగా హాజరై కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వసంతలక్ష్మి, మార్కెట్ డిఎం రజిత, డి సి ఓ రామకృష్ణ.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజున వేములవాడ పట్టణంలోని బాలానగర్, రూరల్ మండలంలోని చెక్కపల్లి, మల్లారం గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నేడు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా తల్లులను కోటీశ్వరులను చేయాలని సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం కొనుగోలు కేంద్రాలను మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మేలైన వంగడాలను ప్రభుత్వం తరఫున అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రైతు ప్రయోజనాల కోసం 21 వేలకోట్ల రైతు రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. సన్న వడ్లకు బోనస్ 500 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం వరి కొనుగోలు కేంద్రాలలో అన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాసేవారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో రైతులకు ముందుగానే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా అదనపు సెంటర్ల ఏర్పాటు చేయాలన్నారు. గతంలో వడగండ్ల వర్షం వలన రైతులు నష్టపోతే కనీసం ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో నష్టపోయిన రైతులకు పదివేల రూపాయల నష్టపరిహారం చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో248 ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు 35 సెంటర్లు ప్రారంభం చేసామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలన్నా రు. సరిపడా టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు పండించిన పంట చివరికించే వరకు కొంటామని ఆయన పేర్కొన్న రు. ఈ కార్యక్రమంలో రైతులతోపాటుగా, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం



న్యూ డిల్లీ ఏప్రిల్ 9 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి రష్యా నుంచి మరోసారి ఆహ్వానం అందింది. మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆండ్రీ రుడెంకో వెల్లడించారు.రెండో ప్రపంచయుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా మే 9న రష్యా విక్టరీ డే పరేడ్ నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తన మిత్రదేశాలకు ఆహ్వానం పంపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోదీకి కూడా ఆహ్వానం పంపింది. విక్టరీ డే వేడుకలకు ప్రధాని మోదీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్లు ఆండ్రీ రుడెంకో తెలిపారు.కాగా, గతేడాది జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించారు. గత పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను భారత్ సందర్శించాలని ఆహ్వానించారు. మోదీ ఆహ్వానాన్ని పుతిన్ కూడా అంగీకరించారు. అయితే, తేదీలు మాత్రం ఇంకా ఖరారు కాలేదు. 'పుతిన్ భారత పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి. మోదీ ఆహ్వానాన్ని ఆయన అంగీకరించారు. గతేడాది మోదీ మాస్కోలో పర్యటించారు.. ఇప్పుడు మా వంతు' అని రష్యా రాయబార కార్యాలయం గత నెల వెల్లడించిన విషయం తెలిసిందే. ఇక పుతిన్, మోదీలు తరచూ ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారు. వివిధ అంశాలపై సంభాషించుకుంటున్నారు. అంతేకాదు పలు అంతర్జాతీయ వేదికలపై కూడా ఇరువురు నేతలు సమావేశమవుతున్నారు.

## అమరావతిలో కొత్త ఇల్లు.. భూమి పూజ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి ఏప్రిల్ 9 : ఏపీ సీఎం, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అమరావతిలో సొంతింటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఉండవల్లిలోని కరకట్టపై ఇప్పటికే చంద్రబాబుకు ఒక ఇల్లు ఉంది. అయితే వరదలు వచ్చిన ప్రతిసారి అది మునిగిపోతూ వస్తోంది. దీంతో అమరావతిలో మరో ఇంటిని నిర్మించుకోవాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే వెలగపూడి సచివాలయం వెనుక ఈ9 రహదారి పక్కనే ఇంటి నిర్మాణం చేపట్టారు. బుధవారం నాడు ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు.వెలగపూడి రెవెన్యూ పరిధిలోని సచివాలయం వెనుక, ఎమ్మెల్యే క్వార్టర్ల సమీపంలో ఐదెకరాల విస్తీర్ణంలోని నివాస ఫ్లాట్‌ను అదే గ్రామానికి చెందిన ఓ రైతు కుటుంబం నుంచి గత ఏడాది డిసెంబర్‌లో చంద్రబాబు కొనుగోలు చేశారు. ఆ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇటీవల పూర్తయ్యింది. దీంతో ఐదెకరాల స్థలంలోని 1455 చదరపు గజాలలో జీప్లస్ వన్ ఇంటిని నిర్మించనున్నారు. నిర్మాణ పనులను వీలైనంత తొందరగా పూర్తి చేసి ఏడాదిలోపు గృహప్రవేశం చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు.బుధవారం నాడు జరిగిన గృహ శంకుస్థాపన మహోత్సవంలో కుటుంబసభ్యులు మినహా పార్టీ నేతలు ఎవరికీ ఆహ్వానం అందలేదు. అంతేకాదు.. ఆ స్థలం వైపు ఎవరూ వెళ్లకుండా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. గ్రీన్ పరదాల మధ్య భూమి పూజ ముగిసింది.

## మోదీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తాడు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



న్యూ డిల్లీ ఏప్రిల్ 9 : ప్రధాని నరేంద్ర మోదీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తాడని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక ఆర్థికవ్యవస్థ లో ఇప్పుడు గుత్తాధిపత్యం రాజ్యమేలుతోందని, ప్రభుత్వ ఆస్తులన్నింటిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతున్నారని ఆయన ఆరోపించారు.గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరంలో జరిగిన ఏఐసీసీ సమావేశంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం రాజ్యమేలుతోంది. ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఈ ప్రభుత్వానికి యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు. కానీ ప్రభుత్వ ఆస్తులను మాత్రం ఒక్కొక్కటిగా మిత్రులకు కట్టబెడుతున్నారు. ఇలాగే కొనసాగితే ఏదో ఒకరోజు ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం ఈ దేశాన్ని అమ్మేస్తారు. నెహ్రూ నిర్మించిన ప్రభుత్వరంగ ఫ్యాక్టరీలు అన్నింటిని మోదీ అమ్ముతున్నారు' అని ఖర్గే విమర్శించారు.'దేశం కోసం నువ్వేం చేశావు, మేమేం చేశాం..? భవిష్యత్ తరాలకు నువ్వు ఏం ఇవ్వదల్చుకున్నావు..?' అని అడిగితే మోదీ నోరు మెదపరని, కానీ కాంగ్రెస్ పార్టీని నిందించడానికి మాత్రం ముందుంటారని ఖర్గే మండిపడ్డారు. దేశంలో అన్నింటా ప్రభుత్వ ఆధిపత్యమే కొనసాగుతున్నదని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నదని, అందుకే ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

# ప్రజాబలం

10 ఏప్రిల్ 2025 గురువారం


## ఆక్వాను వదలని ట్రంప్ టారీఫ్‌లు

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం, అమెరికా ఫస్ట్' నినాదాలతో అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన దూకుడు స్వభావంతో వాణిజ్య యుద్ధానికి తెర లేపాడు. ఏప్రిల్ రెండవ తేదీన వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో వ్యాపార సంబంధ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించాడు. పెంచిన సుంకాలు ఏప్రిల్6 నుండే అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల 60 పైగా దేశాలు ప్రభావితం అవుతున్నాయి. భారత్‌పై 27 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 32 శాతం, ఇతర దేశాలపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఎగుమతుల విలువ 77.5 బిలియన్ డాలర్లు. భారత్ నుండి ఎగుమతి అయ్యే ప్రధాన వస్తువులు ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా ఉత్పత్తులు, యంత్రాలు, పెట్రోలియం ఉత్పత్తులు. అయితే ఈ సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా పడనుంది. ముఖ్యంగా మన రాష్ట్రానికి సంబంధించిన సీ ఫుడ్స్, ఆక్వా రంగాలను తీవ్రంగా నష్టపరచనున్నాయి. రొయ్యల ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. 2022-23 సంవత్సరంలో భారత్ నుండి 63.969 కోట్ల విలువ కలిగిన 1.73 మిలియన్ టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అమెరికా మత్స్య ఉత్పత్తులకు పెద్ద మార్కెట్. మొత్తం 5.6 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయితే అందులో 2.4 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. దాదాపు 40 శాతం మార్కెట్ వాటా భారత్‌దే. మన దేశం నుండి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంస ఉత్పత్తిల్లో రొయ్యలు మూడవ స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు ఆక్వా కల్చర్ అభివృద్ధి ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి అత్యధికంగా ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 1.20 లక్షల ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంది. పశ్చిమ గోదావరి నుండే 3.5 లక్షల టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మొత్తం 18 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో విదేశీ ఎగుమతుల వాటానే అధికం. కోవిడ్-19 కారణంగా ఎగుమతులు నిలిచిపోయి పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయింది. దీనికి తోడు వైరస్‌ల బెడద, ధరలు పతనం కావడం, రైతులకు సాగు పెట్టుబడి పెరిగి పోవడంతో ఆక్వా పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఇటువంటి సమయంలో ట్రంప్ 27 శాతం సుంకాలు విధించడంతో పరిస్థితులు మరింత దిగజారిపోతున్నాయి.

అమెరికా సుంకాలు విధించగానే 100 కౌంట్ రొయ్య ధర 240 నుండి 200 రూపాయలకు పడిపోయింది. కంపెనీలు కొనడానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఏప్రిల్-6వ తేదీ నుండే సుంకాల పెంపు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న వాటి పరిస్థితి ఏంటి? ఆరవ తేదీ తరువాత అమెరికా రీచ్ అయ్యే ప్రతి సరుకుపై పెరిగిన సుంకాలు అమలు చేస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ టారిఫ్ అమలైతే లక్ష రూపాయలు విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేస్తే 26 వేల రూపాయల పన్ను కట్టాలి. అంతేకాకుండా రవాణా, ప్యాకింగ్, ఇతర ఖర్చులు కలిపి దాదాపు 50 శాతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ ఎగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీలు (ఎ.డి.డి)-3.88 శాతం, కౌంటర్ వైలింగ్ డ్యూటీలు (సి.వి.డి)-5.77 శాతం సుంకాలను వసూలు చేస్తున్నారు. కొత్తగా ప్రకటించిన టారిఫ్‌తో కలుపుకుంటే 35 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1 లక్ష టన్నుల రొయ్యలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్నాయి. అమెరికాకు 20-40 కౌంట్ ఉన్న రొయ్యలనే ఎగుమతి చేస్తారు. ఎగుమతిదారులు 30 కౌంట్ రొయ్యలను 480 రూపాయలకు కొని కోల్ట్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. కొత్త టారిఫ్ ప్రకారం ఎగుమతి చేస్తే మరో 80 రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది. అంటే టన్నుకు రూ.8.50 లక్షలు నష్టం వస్తోంది. ఉన్న సరుకును ఎగుమతి చేయలేరు. కోల్డ్ స్టోరేజ్ ఖర్చులు భరించలేరు. మరోవైపు వడ్డీల భారం ఉండనే ఉంది.

ఈ సుంకాల విధింపు వల్ల ఎగుమతిదారులే కాకుండా.. రొయ్యల రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం జరగనుంది. ఒడిదుడుకుల ప్రభావం మొట్టమొదట పడేది రైతులు, కార్మికుల పైనే. కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దారుణం. సాగుతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఫీడ్ కంపెనీలు, టెస్టింగ్ ల్యాబులు, మెడిసిన్ కంపెనీలు, ప్యాకింగ్ యూనిట్లు, ఇందులో పని చేసే కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా పడుతుంది.రాష్ట్రంలో 450 పైగా రొయ్యల హేచరీలు, 50 పైగా ఫీడ్ మిల్లులు, 2 లక్షల పైగా రొయ్యల చెరువులు, 250 ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6 వేలకు పైగా పడవలు, నౌకల ద్వారా కూడా వేలాది మందికి ఉపాధి కల్పుతుంది. 1.5 లక్షల మంది రైతులున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఆక్వా పరిశ్రమ ఉపాధి చూపుతుంది. పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతే వీరంతా ఉపాధిని కోల్పోతారు. ట్రంప్ భారత పర్యటన సందర్భంలోనే భారత్‌పై సుంకాలు విధిస్తానని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. అమెరికాతో సత్సంబంధాలు ఉన్నా సంప్రదింపులు జరపలేదు. ట్రంప్ నా స్నేహితుడు, హౌడీ-మోడీ అని ప్రచారం చేసిన ప్రధాని ఇప్పుడు స్పందించటంలేదు. అక్రమ వలసదారుల పేరు చెప్పి భారతీయుల కాళ్లకు గొలుసులు కట్టి బానిసల్లా ఇండియాకు పంపినా నోరు మెదపలేదు. సుంకాలు విధించి ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నా కిమ్మనడం లేదు మన ప్రధాని. దీంతో రూ.18 వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతుంది. లక్షల మంది రైతులు, కార్మికులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సిక్స్, ఫోర్ అంటూ పథకాల ప్రచారంలో మునిగిపోయింది. ఈక్విడార్ నుండి ఎగుమతిలో గట్టి పోటీ ఎదురవుతుంది. ఇదే అలసత్వం ప్రభుత్వాలు ప్రదర్శిస్తే, ఇండియన్ మార్కెట్ అంతా ఈక్విడార్, ఇండోనేషియా వంటి దేశాలకు షిఫ్ట్ అయిపోతుంది. ఆక్వా రంగం నిలదొక్కుకోవాలంటే ఎగుమతులను ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేసే విధంగా, అమెరికాపై ఆధార పడకుండా ప్రత్యామ్నాయ మార్కెట్లను ఏర్పాటు చేసుకోవడానికి దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. తక్షణ ఉపశమనంగా రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. ఎగుమతిదారులకు, కార్మికులకు ఆర్థికంగా అండగా నిలవాలి. ఎ.పి ఆర్థిక వ్యవస్థలో ఆక్వా రంగం కీలకమైంది. కనుక దీన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

## కంటికి రెప్పలా కాపాడుకొని అల్లారు ముద్దుగా పెంచిన పిల్లలు వృద్ధాప్యంలో ఉన్న తల్లి తండ్రులను పోషించక పోవటం వలన వారు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల నీ కలిసి వారి బాధ నీ వినిపించుకొన్నారు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.**.నిర్మల్ జిల్లాదిలావార్పూర్ కి చెందిన బెల్ల నర్సయ్య, తన పెద్దకుమారుడు అయినటువంటి బెల్లాల లక్ష్మీనారాయణ తండ్రి పేరుమీద ఉన్న మొత్తం ఆస్తిని తన పేరుమీదకు రిజిస్ట్రేషన్ చేయించుకుని కన్నా తల్లి దండ్రులనే కాకుండా తన సోదరులను కూడా మనో వ్యధ గురిచేస్తూ పదే పదే గొడవలు పడుతూ వారిని వృద్ధాప్యంలో మనోవ్యధ కు గురిచేస్తున్నాడు. అతని వల్ల ఈ వృద్ధ తల్లి తండ్రులు మానసిక క్షోభకు గురి అవుతున్నారు.ఇట్టి విషయంపై ఈ రోజు జిల్లా ముఖ్య కార్యాలయం లో నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ నీ కలసి వారి బాధ నీ చెప్పుకోవటం జరిగింది.తన పెద్దకుమారిడి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఎస్పీ వారిని అక్కున చేర్చుకుని అంత విన్న వేణు వెంటనే దిలావార్పూర్ ఎస్ఐ సందీప్ కి తగిన చర్యల నిమిత్తం ఆదేశించడం జరిగింది. వీరికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వటం జరిగింది

## లెదర్ పార్క్ లో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి
## ఎంపీ ఎమ్మెల్యేలకు లెదర్ పార్క్ నాయకుల వినతి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 9:**మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ఏరియాలో గల లెదర్ పార్కులో మహనీయుల విగ్రహాల ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం లెదర్ పార్క్ సాధన సమితి నాయకులు ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి లకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏర్పాటుచేసిన లేదా పార్కులో మహనీయులు బాబాసాహెబ్ డాక్టర్, బి.ఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, విగ్రహాలతో పాటు పెద్దపల్లి మాజీ పార్లమెంటు సభ్యులు కేంద్ర మాజీ మంత్రి, కాక జి. వెంకట స్వామి దంపతుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేయించేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గతంలో మీరు ప్రకటించిన డి.ఎం.ఎఫ్.టీ నిధులు 20 లక్షలతో ఎస్.సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2000 మందికి శిక్షణ ఇప్పించాలని తద్వారా వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. లెదర్ పార్క్ వెంటనే ప్రారంభించాలని యువతకు ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అని తద్వారా కుటీర పరిశ్రమలు కూడా ఏర్పడతాయని ఆయన వివరించారు.

## హనుమాన్ జయంతి విజయయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలి..
## బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు




**కూకట్పల్లి (ప్రజాబలం)ఏప్రిల్ 09:**హనుమాన్ జయంతిని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు పిలుపునిచ్చారు. సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణపై ఈ మేరకు ఉత్సవ కమిటీలతో బాలానగర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శాంతి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు అధ్యక్షత వహించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించి, వీర హనుమాన్ విజయయాత్రపై ఏసీపీ సమీక్షించారు.

ఈ సందర్భంగా ఏసిపి హనుమంతా రావు మాట్లాడుతూ పరిమితికి మించి శబ్దంతో కూడిన సౌండ్ బాక్సులు వాడకూడదని స్పష్టం చేశారు. డీజేలకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అనుమతుల కొరకు నిర్వాహకులు ముందే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతులు పొందినవారికి సైబరాబాద్ పోలీస్ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో డిఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ్, సరితా రెడ్డి, సరళ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ డి ఎం ఏ షాహిద్ మసూద్ ఆధ్వర్యంలో ఫిట్టర్ సంపత్ రావు పై విచారణ



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఫిట్టర్ సంపత్ రావు పై విచారణ చేయాలని పబ్బు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు పై బుధవారం ఆర్ డి ఎం.ఏ. షాహిద్ మసూద్ విచరణ చేపట్టి సంపత్ రావు, ఫిర్యాదు దారు పబ్బు శ్రీనివాస్ లను పూర్తిగా విచారణ నిర్వహించారు. ఫిట్టర్ విధులకు కావలసిన ఎటువంటి పత్రాలు లేకండా విధులు నిర్వహిస్తున్నారని, ఇచ్చిన ఫిర్యాదు అధారంగా విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. సంపత్ రావు యొక్క ఐటిఐ సర్టిఫికేట్ పరిశీలన చేసి ఈ సందర్భంగా ఆర్డీ.ఏం.ఏ మసూద్ మాట్లాడుతూ పూర్తి నివేదకను సి.డి.ఏం.ఏ. అధికారికి హైదరాబాద్ అందజేయనునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ మొహమ్మద్ ఆయాజ్, మేనేజర్ జి రాజిరెడ్డి,గుర్రపు శ్రీనివాస్ (మేనేజర్ ఆర్డిఆఫీస్ ) తదితరులు పాల్గొన్నారు .

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావు పాస్‌పోర్టు రద్దు

హైదరాబాద్ ఏప్రిల్ 9 : తెలంగాణలో పెను ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పాస్‌పోర్టును పాస్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా రద్దు చేసింది. ఆయనపై రెడ్ కార్నర్ నోటీసులతో అథారిటీ ఈ నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా ప్రభాకర్ రావును ఇండియాకు రప్పించేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తన ఆరోగ్యం బాగోలేదని.. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నానని, ఇండియాకు రాలేనని తప్పించుకునే ప్రయత్నిస్తుండటంతో.. తెలంగాణ పోలీసులు, కేంద్ర ప్రభుత్వం, యూఎస్ కాన్సులేట్ సహాయంతో ప్రభాకర్ రావును ఇండియాకు తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

## పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి- సిపిఎం డిమాండ్



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.**. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ నేతృత్వంలో నిర్మల్ ఆర్డిఓ కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా నూతన్ కుమార్ మాట్లాడుతూ,గ్యాస్ ధర రూ.876నుండి రూ.905కి పెరగడం వలన పేద,మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇంధన ధరలను నియంత్రించకుండా కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం మితిమీరిన ధరలు వేసి ప్రజలపై భారం మోస్తోంది"అని విమర్శించారు.

అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గకపోవడం దారుణమని పేర్కొన్నారు. "నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న ఈ పరిస్థితుల్లో గ్యాస్ ధర పెంపు ప్రజలను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. ఇది ములిగే నక్కపై తాటి పండు పడిన చందంగా ఉంది"అని వ్యాఖ్యానించారు.

పెంచిన ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోకపోతే, సిపిఎం అధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫసి ఉద్దీన్,పోశెట్టి, శంబు, డాకూర్ తిరుపతి,మురళి, మజీద్,పంద్రం ఆనంద్ రావు,విజయ్, సంతోష్,సోమేశ్ తదితరులు పాల్గొన్నారు. అభినందనలతో.
సిపిఎం జిల్లా కమిటీ,నిర్మల్

# నిర్మల్ లో రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు చేయాలి: తుడుం దెబ్బ డిమాండ్



ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా బ్రిటిష్,నిజం ప్రభుత్వాన్ని గడకడలాడిచ్చిన ఆదివాసి వీరుడు రాంజీ గోండు చరిత్రను నేటితరం ఆదివాసులకు తెలియాలంటే నిర్మల్ జిల్లా కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు వెంక గారి భూమయ్య డిమాండ్ చేశారు.తుడుం దెబ్బ ఆధ్వర్యంలో 165వ వర్ధంతి నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు నిర్మల్ జిల్లాకు పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రులు రాష్ట్ర మంత్రులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.ఆదివాసులపై కృషి వేసే కుట్ట చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో ఆదివాసులు బిక్కుబిక్కుమని బతుకుతున్నారని, ఎప్పుడు ఎక్కడినుండో ప్రమాదం పొంచి వస్తుందని భయంతో బతుకుతున్నారన్నారుఆదివాసులకు ఇంటి స్థలం తో పాటు ఇలా నిర్మాణాలు చేసి ఇవ్వాలని,పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, జిల్లా కేంద్రంలో 200 ఎకరాలలో రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు ఏర్పాటు చేస్తామని ఆదివాసుల హక్కులు,చట్టాలను రక్షిస్తామన్న నాయకులు ఇప్పుడు ఆదివాసులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు నడుచుకుంటున్నాయనన్నారు.మహారాష్ట్ర నుండి వచ్చిన వలస లంబాడాలను వెంటనే తొలగించి ఆదివాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివాసులకు మినీ ఐటిడిఏ ను ఏర్పాటు చేయాలని,సబ్సిడీ రుణాలను బ్యాంకు కన్సల్టెంట్ లేకుండానే ఆదివాసులకు అందించాలన్నారు. రాంజీ గోండు సహా వెయ్యి మంది అమరుల ప్రాణ త్యాగాలను గుర్తించి, స్మారకార్థం ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు,చరిత్ర పుట్టాలలో పాఠ పుస్తకాలలో ఎక్కడ వారికి చోటు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి మర్సకోల రాంజీ గోండు వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు.ఆదివాసి పోరాట యోధుల చరిత్రను పాట పుస్తకాలలో పొందుపరిచి నేటితరం ప్రజలకు గుర్తుండేలా భారీ ప్రపంచానికి తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంద మల్లేష్,తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు సుంచు శ్రీనివాస్, తోడుసం గోవర్ధన్, భీమ్రావు,శంకర్, భోజన్న,జిల్లాలో తుడుం దెబ్బ నాయకులు,ఆదివాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత,కలిసికట్టుగా పోరాడుదాం రాజ్యాంగాన్ని కాపిడుదాం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్







ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 09 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చివరి రోజు లక్షెట్టిపేట మండలంలోని కొత్తూరు,ఎల్లారం గ్రామాలలో పెద్ద ఎత్తున్న ప్రజల తో జై బాపు,జై భీమ్,జై సంవిధన్,రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ముందుగా ఈ రెండు గ్రామ లలో జాతీయ జెండాను ఎగురా వేసి పాదయాత్ర ను ప్రారంభించారు,మండల అధ్యక్షులు పింగళి రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరిబాధ్యత,కలసికట్టుగా పోరాడుదాం.రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నాము,అని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు. మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు,గత వారం రోజుల నుంచి లక్షెట్టిపేట మండలంలో అన్ని గ్రామాల ప్రజలకు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ సహకరించిన్నందుకు అందరికి ధన్యవాదములు అని తెలిపారు,తర్వాత ముగింపు సందర్భంగా సీనియర్ నాయకులకు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండ బుచ్చన్న జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచందర్ రావు,చెల్ల నాగభూషణం,చింత అశోక్ కుమార్ జిల్లా ఆర్ టి ఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్, లక్షెట్టిపేట మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్,మార్కెట్ కమిటీ డైరెక్ట్ ర్ తోట రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేలా రాజు,జిల్లా అధికార ప్రతినిధి బియ్యల తిరుపతి, కంది మోహన్,గుండ శ్రీనివాస్,సురేష్ నాయక్ అన్నం చిన్నాన్న, కొత్తూరుఎల్లారం గ్రామ నాయకులు కార్యకర్తలు యువ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

# సత్యాహింసల మార్గదర్శి మహావీరుడు

వేదయుగంలో పెరిగిన జీవహింస, ఖర్చుతో కూడిన యజ్ఞయాగాలు, క్రతువులు, సమాజంలో పేరుకుపోయిన వర్ణ వివక్ష, మత వైషమ్యాలు, ఆర్థిక అసమానతలు ఆలోచనా పరులైన కొద్దిమందిలో జిజ్ఞాసను రేకెత్తించాయి. వీటిని అధిగమించడానికి అజీవకులు, చార్వాకులు, జైన, బౌద్ధ మతకర్తలైన.. మహావీరుడు, బుద్ధుడు వంటివారు క్రీ.పూ 6వ శతాబ్దంలో భావవికాసానికి నాందిపలికారు. జైనమతాన్ని అనుసరించేవారు జైనులు. జినులు అంటే కోరికలను జయించి వారు అని అర్థం. జైన మతాన్ని వృషభ నాథుడు స్థాపించగా, ఇది 'జిన' (విజేత) అనే పదం నుంచి వచ్చింది. జైన మత గురువులను తీర్థంకరులని పిలుస్తారు. తీర్థంకరులంటే పూర్ణ పురుషులు. జీవన ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించినవారు.జైనమతంలో తొలి తీర్థంకరుడు వృషభనాథుడు కాగా, ఆయన గురించి ఋగ్వేదంలో పేర్కొనబడింది. అంతే కాదు విష్ణు పురాణం, భాగవత పురాణంలో నారాయణావతారంగా కీర్తించ బడ్డాడు. దీనిని బట్టి జైన మతం ఋగ్వేద మతం అంతటి ప్రాచీనమైంది. ఇక, చిట్ట చివరి ఇరవై నాలుగో తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడని జైనుల విశ్వాసం.బీహార్‌లో వైశాలికి సమీపములో కుండ గ్రామంలో క్రీ.పూ. 599 లో (అధిక సంఖ్యాకుల విశ్వాసం) క్షత్రియ కుటుంబములో సిద్దార్థ మహారాజుకు, రాణి త్రిషలకు జన్మించిన మహావీరుడికి తల్లి దండ్రులు పెట్టిన పేరు వర్ధ మానుడు. కొందరు జైనులు మాత్రం మహావీరుడు క్రీస్తు పూర్వం 599లో జన్మించాడని నమ్ముతుండగా, మరి కొందరు క్రీస్తు పూర్వం 615లో జన్మించాడని భావిస్తున్నారు. అయితే ఇందులో దేనికీ స్పష్టమైన ఆధారాలు లేవు. హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసం 13వ రోజున అంటే చైత్ర శుక్ల త్రయోదశి రోజున మహావీరుడు జన్మించారు. అల్లారుముద్దుగా పెరిగిన మహావీరుడు తల్లి దండ్రులు 28 వ ఏట మరణించారు. యశోధరను వివాహమాడి, ఓ కుమార్తెకు జన్మనిచ్చిన తరువాత తన రాజ్యాన్ని 30 సంవత్సరాల పాటు పరిపాలించిన మహావీరుడు అకస్మాత్తుగా తన సింహాసనాన్ని, కుటుంబాన్ని విడిచి పెట్టి సత్యాన్వేషణ కోసం స్వయం గా బయలు దేరాడు. తన 30వ ఏట గృహస్థ్యాన్ని త్యజించి, ఆరు సంవత్సరాలు మక్కలి గోశాలుని శిష్యునిగా ఉన్నాడు. 36 వ ఏట సన్యాసాన్ని స్వీకరించి, వర్ధమాను డు ఆ తరువాత రిజుపాలిక నదీ తీరంలోని జృంబిక గ్రామం దగ్గర కఠోర తపస్సు చేశాడు. తన 43వ ఏట సాలవృక్షం కింద వైశాఖమాసం పదమూడో రోజున జృంభిక గ్రామంలో జానోదయం కలిగింది. తద్వారా తపోసిద్ధిని పొందాడు. తదనంతరం... వర్ధమానుడు అంగ, మిథిల, కోసల, మగధదేశాలలో తన తత్వాన్ని ప్రచారం చేశాడు. అప్పటి కే జైన మతానికి 23 మంది తీర్థంకరులుగా ఉన్నప్పటికీ మహా వీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధిం చిన వివరాలు వెలుగు చూశాయి. 32ఏళ్ళ పాటు అహింసా ధర్మముతో ప్రచారం జరిపిన మహావీరుడు తన 72వ ఏట క్రీ.పూ.527లో పావాపురిలో దేహాన్ని త్యజించాడు.మహావీరుని బోధనలు: 1. వైదిక కర్మలు చేయడం, దేవుణ్ని వేడు కోవడం వల్ల మనిషికి ఉపయోగం లేదు. 2. చెడు చేయకుండా మంచి జీవితాన్ని గడపడమే మోక్ష మార్గం. 3. జైనమత ప్రకారం 'ఆత్మ' ప్రాణులకే కాదు, ప్రతి వస్తువులోను ఉంటుంది. దేవుడితో నిమిత్తం లేదు. 4. సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ చరిత్ర- మోక్ష మార్గాలు. వీటిని 'త్రిరత్నాలు' అంటారు. (సరైన విశ్వాసం, సరైన జ్ఞానం, సరైన నడవడి) 5. పార్శ్వ నాథుడు ప్రతిపాదించిన సత్య, అహింస, అపరిగ్రహ, అనస్తేయ అనే నాలుగు మూల సూత్రాలకు మహావీరుడు బ్రహ్మచర్య సూత్రాన్ని అదనంగా జోడించాడు. వీటిని 'పంచానువ్రత' అని పిలుస్తారు. పార్శ్వనాథుడు శ్వేతాంబర వాదాన్ని, మహావీరుడు దిగంబర వాదాన్ని సమర్థించారు.మహావీరుని అనుచరులను నిగ్రంధులు అంటారు (బంధాల నుంచి విముక్తి పొందిన వారు). జైనులు పూజించే స్త్రీ దేవతను 'విద్యాదేవి' అని పిలుస్తారు. జైన మతంలో సల్లేఖనం (శరీరాన్ని క్షీణించుకొని మరణించడం) ద్వారా పరమపదం చేరుకోవడం ఆచారం. చంద్రగుప్త మౌర్యుడు సల్లేఖనం ద్వారా పరమపదించాడు. భారతీయ వాస్తు - శిల్ప కళాభివృద్ధికి జైనమతం గొప్ప సేవ చేసింది. మహావీరుడు సాధారణంగా కూర్చొని లేదా నిలబడి ధ్యాన భంగిమలో, అతని క్రింద ఉన్న సింహం చిహ్నంగా చిత్రీకరించ బడింది. ఉత్తర భారతదేశం లోని మధురలోని పురావస్తు ప్రాంతాల నుండి అతని మొట్టమొదటి విగ్రహాన్ని క్రీ.పూ 1వ శతాబ్దం నుండి క్రీ. శ. 2వ శతాబ్దంకి చెందినది. అయన పుట్టిన రోజును మహావీర్ జయంతిగా జరుపు కుంటారు. ఆయన మోక్షంను జైనులు దీపావళిగా గుర్తించారు. చిన్న వయసులోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సత్యం, అహింస, ప్రేమ మార్గాన్ని చూపించిన మహావీరుని జయంతి సందర్భంగా జైన మతానికి చెందిన వారు వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటారు. మహావీరుని ఊరేగింపు కూడా నిర్వహిస్తారు. దీని ద్వారా మహావీరుని సందేశాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తారు.

# గాంధేయవాది మొరార్జీ దేశాయ్

తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏనాడూ రాజీపడని విలక్షణ వ్యక్తిత్వం దివంగత ప్రధాని మొరార్జీ దేశాయ్‌కే సొంతం. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. ధృఢమైన గాంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల - వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయవాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. 1927-28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ క్రియాశీలక రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్‌లో సివిల్ సర్వీసులో చేరారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు.

భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, ఆయన బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హెూంమంత్రి బాధ్యతలను చేపట్టారు.1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది.

బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964, 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హెూం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతో పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు.అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే -ఎ - పాకిస్తాన్ - 1986లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ.మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు.

స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు. పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశచరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్పనాయకునికి అలాంటి అవకాశం లేకుండాపోయింది.

అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం.మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించినందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్నుమూశారు.

# రజనీని అడ్డంగా బుక్ చేస్తున్న ఎంపీ

గుంటూరు, ఏప్రిల్ 9 వైసిపి నేతల విషయంలో టిడిపి నేతలు కొంతమంది కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు కొంతమంది టీడీపీ నేతలు గతంలో తమ ఇబ్బంది పెట్టిన నాయకుల విషయంలో వెనక్కు తగ్గడం లేదు. ఈ విషయంలో పల్నాడు జిల్లా ముందుంటుంది. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు వర్సెస్ చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి విడుదల రజిని ల మధ్య వాతావరణం చినికి చినికి గాలి వానగా మారింది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎంపీ కంటే మంత్రిగా ఉన్న రజిని పవర్ ఫుల్ గా ఉండేవారు.ఆమె మాటకు వైసీపీ అధిష్టానం వద్ద కాస్త వెయిట్ ఎక్కువగా ఉండేది. దీనితో రజిని ఆడిందే ఆట పాడిందే పాటగా ఉండేది. దీనికి తోడు అధికారులు కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమెకు పెద్ద ఎత్తున సహకరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇలా సహకరించబట్టే ఐపీఎస్ అధికారులను అడ్డం పెట్టుకుని.. ఒక స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి ఏకంగా రెండు కోట్ల రూపాయలు రజనీ తీసుకున్నారు అనేది టీడీపీ ప్రధాన ఆరోపణ. ఇక రజనీ విషయంలో లావు కృష్ణదేవరాయలు ఇప్పుడు దూకుడుగా ఉన్నారు.ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. లావు కృష్ణదేవరాయలపై ఆరోపణలు చేసిన రజిని ఆ తర్వాత ఎంపీ ఇచ్చిన స్ట్రోక్ కి కంగుతిన్నారు. ఆమె మొదలు పెట్టారని తాను ఆపే ప్రసక్తే లేదని.. ఇది ఎక్కడ వరకు వెళుతుందో చూడాలంటూ లావు కృష్ణదేవరాయలు ఘాటుగా మాట్లాడారు. చాలెంజ్ కు తగ్గట్టు ఇప్పుడు రజిని వ్యవహారాలపై ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమె చేసిన అక్రమాలకు.. సంబంధించి నివేదికలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పాటుగా కేంద్ర ప్రభుత్వం పెద్దలకు కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా రైతుల భూముల విషయంలో ఆమె అనుసరించిన వైఖరి, పాల్పడిన అక్రమాలపై సాక్షా లతో సహా ఆయన ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఆమె మరిది గోపిని అడ్డం పెట్టుకొని ఆమె పెద్ద ఎత్తున చిలకలూరిపేట నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడ్డారు అనేది ఎంపీ ఆరోపణ. ఇప్పుడు వాటిని రుజువు చేసేందుకు పక్కా.. ఆధారాలతో ఆయన రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. తాజాగా చిలకలూరిపేటలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ లో కొంతమంది రైతులు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు కూడా చేసారు.రజినీ పై చర్యలు తీసుకోవాలని ఆమె మరిది గోపి పై కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాగే మరికొన్ని కేసులు బయటకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించిన వ్యవహారంలో ఏసీబీ అధికారులు గవర్నర్ అనుమతి తీసుకునే కేసు నమోదు చేశారు. దీనితో భవిష్యత్తులో రజనీకి ఇబ్బందులు తప్పవని.. ముఖ్యంగా లావు కృష్ణదేవరాయల నుంచి ఆమె మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని, ఇదే ఆమె రాజకీయ జీవితాన్ని నాశనం చేసినా ఆశ్చర్యం లేదంటూ కొంతమంది కామెంట్ చేస్తున్నారు.

# దుర్గ గుడి భూముల లీజు పొడిగింపు వివాదం

విజయవాడ, ఏప్రిల్ 9, విజయవాడలో దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో ప్రధాన ప్రాంతంలో ఉన్న దాదాపు ఆరు ఎకరాల భూమి లీజు గడువు ముగియడంతో దానిని మరోమారు పొడిగించాలని లీజుదారుల నుంచి దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు అందాయి. అందులో విద్యా సంస్థను నిర్వహిస్తుండటంతో మరో 50ఏళ్లకు పొడిగించాలని లీజుదారులు అభ్యర్థించారు. యాభై ఏళ్లుగా నామమాత్రపు ధరతో ఉన్న దుర్గగుడి భూముల లీజును మరోసారి పొడిగించే ప్రతిపాదనకు దేవాదాయ శాఖ అభ్యంతరం తెలిపింది. యాభై ఏళ్ల తర్వాత ఏమి జరుగుతుందో తెలియనందున ఆలయ భూముల్ని సమగ్రంగా సర్వే చేసి వాటిని శాశ్వతంగగా డిజిటల్ రూపంలో భద్రపరిచిన తర్వాత లీజు ప్రక్రియపై ముందుకు వెళ్లాలని ఆ శాఖ కార్యదర్శి కమిషనర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి పటమట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో 5.90ఎకరాల భూమిని లీజుకు తీసుకున్న సిద్ధార్థ అకాడమీ పేరిట లీజు పొడిగించాలని కొందరు అధికారులు, దేవాదాయ శాఖ అధికారులకు మౌఖికంగా సూచించారు. దీంతో లీజు ప్రతిపాదనల్ని దేవాదాయ శాఖ ఎస్టేట్స్, లీగల్ విభాగం క్షుణ్ణంగా అధ్యయనం చేసి చట్ట ప్రకారం సాధ్యం కాదని తేల్చేశారు. యాభై ఏళ్లకు లీజును పొడిగిస్తే అప్పటికి 100ఏళ్లు పూర్తై యాజమాన్య హక్కుల్ని దేవస్థానం కోల్పోతుందని, భూమికి శాశ్వత యజమానులుగా లీజుదారులు అవుతారని అభ్యంతరం అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో లీజు గడువును తగ్గించి పొడిగించాలనే సూచనలు అందాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజు కొనసాగుతుండటంతో లీజు పొడిగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కొత్తగా మరోసారి లీజుకు తీసుకోవాల్సిందేనని కొత్త చట్టం ప్రకారమే లీజులు పొందాలని వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో దుర్గగుడి భూముల లీజు వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చే బాధ్యత ఇంఛార్జి హోదాలో ఉన్న ఉన్నతాధికారి భుజాలకు ఎత్తుకున్నారు. పెద్దసార్ ఆదేశించారంటూ అధికారులపై ఒత్తిడి చేయడంతో లిఖిత పూర్వకంగా వివరణలు, ప్రతిపాదనలు ఇస్తే తప్ప తాము ముందుకు వెళ్లలేమని ఆ శాఖ అధికారులు తేల్చేశారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం అవుతుండటంతో దేవాదాయ శాఖ చట్టానికి కొన్నేళ్ల క్రితం మార్పులు చేశారు. పాత చట్టంలో లీజుల పొడిగింపుకు అవకాశం ఉన్నా కొత్త చట్టంలో లీజు పొడిగింపు క్లాజ్ లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజులో ఉన్న భూముల్ని మరోసారి పొడిగించడం ప్రస్తుత చట్టం ప్రకారం సాధ్యం కాదని, అలా చేయాలంటే క్యాబినెట్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. దేవాదాయ శాఖ భూమి లీజు వ్యవహారంపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తులో తలెత్తే న్యాయవివాదాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని భయపడుతున్నారు. ఈ క్రమంలో భూముల లీజు పొడిగించాలని ఒత్తిడి చేస్తోన్న అధికారినే ఏ నిబంధన ప్రకారం భూముల లీజు పొడిగించాలో ప్రతిపాదనలు పంపాలని దేవాదాయ శాఖ అధికారులు సూచించారు. వ్యవసాయేతర భూమిగా వినియోగంలో ఉన్న భూమి విలువను ఎలా నిర్ణయిస్తారో కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు లక్షన్నర లీజుగా చెల్లిస్తుండగా 10శాతం పెంపుదలతో లక్షా 65వేలుగా లీజు ధరను ప్రతిపాదించడంపై కూడా దేవాదాయశాఖ అభ్యంతరం చెబుతోంది. చట్టంలో లీజు పొడిగింపు అవకాశం లేనపుడు బహిరంగంగా జరిగే ప్రక్రియలోనే భూమి ధరను ఖరారు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందులో విద్యా సంస్థలు కొనసాగుతుండటంతో బహిరంగ వేలాన్ని మినహాయించినా అద్దె ధరను మాత్రం మార్కెట్ ధరలకు అనుగుణంగా ఖరారు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. దేవాదాయ శాఖలో ఇన్‌ఛార్జి హోదాలో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి లీజు వ్యవహారంలో లిఖిత పూర్వకంగా ప్రతిపాదనలు చేయకుండా ముందుకు వెళ్లలేమని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మౌఖిక ఆదేశాలను పాటిస్తే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు తాము బాధ్యత వహించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో గతంలో కానూరు గ్రామ పంచాయితీ పరిధిలో సర్వే నంబర్ 282లో ఉన్న 12.39 ఎకరాల భూమిని యాభై ఏళ్లకు లీజుకు ఇవ్వాలని సిద్ధార్థ అకాడమీ 1997 నవంబర్ 25న కోరగా అప్పట్లో దేవాదాయ శాఖ లేవనెత్తిన అభ్యంతరాలను గుర్తు చేస్తున్నారు. దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో మార్కెట్ ధరలకు అనుగుణంగా లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. 1975-76 భూమిని లీజుకు ఇచ్చినపుడు మొదటి ఆరేళ్లు రూ.6వేల రుపాయలకు లీజుకు ఇచ్చారని తర్వాతి పదేళ్లకు రూ.7వేలు, తర్వాత పదేళ్లు 8వేలు, ఆ తర్వాత పదేళ్లు 9వేలు, ఆ తర్వాత పదేళ్లు 10వేలు, ఆ తర్వాత ఏడాదికి రూ.11వేల అద్దె చెల్లించేలా యాభై ఏళ్లకు లీజుకు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సిద్ధార్థ అకాడమీ పేరిట విజయవాడ మొగల్రాజపురంలోని సర్వే నంబర్ 76లో 8.22 ఎకరాలు, పటమట సర్వే నంబర్ 17లో 5.98ఎకరాల భూమి సిద్ధార్థ అకాడమీ పేరిట లీజుకు ఉంది. 2012 నాటికి ఈ భూముల విలువ రూ.176.34కోట్లుగా నిర్ధారించారు. పటమటలో ఉన్న భూమికి గజం రూ.30వేల చొప్పున రూ.86.83కోట్లు, మొగల్రాజపురంలో ఉన్న భూమికి గజం రూ.22,500 చొప్పున రూ.89.51కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఈ విలువలు భారీగా పెరిగాయని దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం ఆ స్థాయిలో లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

# టీడీపీ నేతలదే హవా...

విజయనగరం, ఏప్రిల్ 9, ఏపీలో కూటమి ఏకపక్ష విజయం దక్కించుకున్న జిల్లాల్లో విజయనగరం ఒకటి. దాదాపు అన్ని నియోజకవర్గాలను కైవసం చేసుకుంది కూటమి. బలమైన బొత్స సామ్రాజ్యం కూలిపోయింది. ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఓటమి చవిచూశారు. అయితే ఇంతటి విజయాన్ని నిలుపుకోలేని స్థితిలో ఉంది కూటమి. అధికారంలోకి వచ్చిన పది నెలలకే విభేదాల పర్వం మొదలైంది. పతాక స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లిమర్లలో పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే వర్సెస్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి అన్నట్టు పరిస్థితి మారింది. రెండు పార్టీల అధినాయకత్వాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఈ ఇద్దరు నేతలు పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ కూటమిలో అడ్డగోలు చీలిక కనిపిస్తోంది.

2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరఫున లోకం మాధవి పోటీ చేశారు. టిడిపి శ్రేణులు సహకరించడంతో భారీ మెజారిటీతో గెలిచారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మాధవి టిడిపి శ్రేణులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శ ఉంది. టిడిపిని కాదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన వారికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. తనకంటూ నియోజకవర్గంలో ఒక సొంత క్యాడర్ను తయారు చేసుకునే పనిలో పడ్డట్టు తెలుస్తోంది. 2019లో కేవలం 5000 ఓట్ల వరకు మాత్రమే తెచ్చుకున్నారు మాధవి. అందుకే ముందు జాగ్రత్త చర్యగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను తన వైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ వచ్చారు నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు. తనకే టికెట్ వస్తుందని ఆయన ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం బాగానే ఖర్చు పెట్టారు. లోకేష్ పాదయాత్ర ముగింపును తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయించారు. అయితే ఇక్కడ టిడిపికి మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు ఉండేవారు. ఆయన వయోభారంతో పక్కకు తప్పుకోవడంతో బంగార్రాజుకు నియోజకవర్గ టిడిపి బాధ్యతలు అప్పగించారు. దీంతో తనకు టికెట్ ఖాయమని భావించిన కర్రోతు బాగానే కష్టపడ్డారు. పొత్తులో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించడంతో బాధపడ్డారు. కానీ చంద్రబాబు సముదాయించడంతో జనసేన అభ్యర్థి లోకం మాధవి గెలుపు కోసం కృషి చేశారు. అయితే ఇప్పుడు అదే కర్రోతును నిర్లక్ష్యం చేస్తున్నారు ఎమ్మెల్యే మాధవి. టిడిపి క్యాడర్ తో పాటు నాయకత్వాన్ని నిర్వీర్యం చేసే పనిలో పడ్డారు. అందుకే ఇక్కడ విభేదాలు రోజు రోజుకు ముదురుతున్నాయి. పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఎత్తుకు పైఎత్తులు అన్నట్టు సాగుతున్నాయి. కూటమి అధికారంలోకి రావడంతో కర్రోతు బంగార్రాజు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి దక్కింది. కీలకమైన మార్క్ ఫెడ్ అధ్యక్ష పదవి దక్కడంతో ఆయన సైతం నియోజకవర్గంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో జనసేన ఎమ్మెల్యే మాధవి తో విభేదాలు మరింత ముదురుతున్నాయి. ఎమ్మెల్యే పాల్గొంటున్న కార్యక్రమానికి కుర్రోతు హాజరు కావడం లేదు. కర్రోతు బంగారు రాజు వెళ్తున్న కార్యక్రమానికి లోకం మాధవి రావడం లేదు. దీంతో కూటమిలో ఒక రకమైన విచ్ఛిన్నకర పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఈ నియోజకవర్గంలో బొత్స కుటుంబం పట్టు బిగిస్తోంది.

పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. అందుకే ఈ విషయాన్ని హై కమాండ్ దృష్టికి తీసుకు వెళ్లే పనిలో పడ్డాయి రెండు పార్టీల శ్రేణులు. అయితే మరోసారి అమరావతికి పిలిచి క్లాస్ పీకుతారా? లేకుంటే కీలక సూచనలు చేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

# సజ్జల స్థానంలో సతీష్ రెడ్డి

కడప, ఏప్రిల్ 9, వైయస్సార్ కాంగ్రెస్ లో జగన్మోహన్ రెడ్డి విధేయత కలిగిన నేతలు చాలామంది ఉన్నారు. ఆయన చుట్టూ పార్టీకి స్తంభాల వ్యవహరించే నాయకులు ఉన్నారు. అయితే వారిపై 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. విమర్శలు వ్యక్తమయ్యాయి. వారి పేరు చెప్పి చాలామంది నేతలు పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఆ కీలక నాయకుల్లో ఒకరైన విజయసాయిరెడ్డి సైతం పార్టీ నుంచి బయటికి వెళ్లిపోయారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ ఏర్పాటు చేయక ముందు నుంచే ఆయనకు సన్నిహితుడు విజయసాయిరెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి ఆడిటర్ గా ఉన్న విజయసాయి కాలక్రమంలో జగన్మోహన్ రెడ్డికి అత్యంత నమ్మిన బంటుగా మారిపోయారు. అటువంటి వ్యక్తి పార్టీ నుంచి బయటకు వెళ్లే క్రమంలో అనేక రకాల ఆరోపణలు చేశారు. కోటరీని మార్చుకోకుంటే మాత్రం జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పరోక్షంగా వైవి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ల పై సంచలన ఆరోపణలు చేశారు విజయసాయిరెడ్డి. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పార్టీలో కీలక నియామకాలు చేపడుతున్నారు. అందులో భాగంగా సజ్జల రామకృష్ణారెడ్డి బాధ్యతల నుంచి తొలగిస్తుండడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత సజ్జల చుట్టూ వివాదాలు నడిచాయి. చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లు సజ్జలపై ఆరోపణలు చేశారు. ఆయన తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. అయినా సరే జగన్మోహన్ రెడ్డి మాత్రం సజ్జల రామకృష్ణారెడ్డికి అవకాశం ఇస్తూనే ఉన్నారు. ఏకంగా ఆయనకు రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకునే బాధ్యతలు అప్పగించారు. ఇటీవల విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యల నేపథ్యంలో సజ్జలను జగన్మోహన్ రెడ్డి మార్పు చేయడం మాత్రం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవరెడ్డిని సోషల్ మీడియా ఇన్చార్జి పదవి నుంచి తొలగించారు. ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డికి సైతం రాష్ట్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారు. దీంతో జగన్మోహన్ రెడ్డికి తత్వం బోధపడినట్లు అయింది. మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఖాళీ చేసిన రాష్ట్ర సమన్వయకర్త పదవిని తన సొంత నేతకు అప్పగించుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికలకు ముందు టిడిపి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సతీష్ రెడ్డికి ఇవ్వాలని ఒక నిర్ణయానికి వచ్చారు. సతీష్ రెడ్డి సుదీర్ఘకాలం వైయస్సార్ కుటుంబం పై పోటీ చేస్తూ వచ్చారు. ముందుగా రాజశేఖరరెడ్డి, తరువాత జగన్మోహన్ రెడ్డి లపై పోటీ చేస్తూ వచ్చిన ఆయనకు 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించారు చంద్రబాబు. ఆ ఎన్నికల్లో బీటెక్ రవికి అవకాశం కల్పించడంతో బయటకు వచ్చేసారు సతీష్ రెడ్డి. అయితే పార్టీ ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి పై అభిమానంతో అదే పార్టీలో కొనసాగుతున్నారు. చాలా యాక్టివ్ గా పని చేస్తున్నారు. అందుకే రాష్ట్ర సమన్వయ బాధ్యతలను సతీష్ రెడ్డికి అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అయితే సజ్జల రామకృష్ణారెడ్డికి వేరే బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. కానీ సజ్జలను రాష్ట్ర సమన్వయకర్త బాధ్యతలు నుంచి తొలగిస్తే మాత్రం ఆయన ఇబ్బంది పడక తప్పదు. ఇప్పటికే సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు అజ్ఞాతంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసులకు భయపడి దూరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇటువంటి సమయంలో సజ్జల రామకృష్ణారెడ్డికి సైతం ఆ పదవులను దూరం చేస్తుండడం మాత్రం కొత్త ఆలోచనలు తెరపైకి వస్తున్నాయి. సజ్జలకు పొమ్మనలేక పొగ పెడుతున్నారా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి.

# బిగ్ బాస్ లోకి అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్

రాజమండ్రి ఏప్రిల్ 9, ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది ఎవరైనా ఉన్నారంటే వారు 'అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్. గత 4 రోజులుగా నెట్టింట వీరిపై ఒకటే ట్రోల్స్, మీమ్స్, క్లారిఫికేషన్ వీడియోస్, అపాలజీ వీడియోస్. చాలాకాలంగా పచ్చళ్ల వ్యాపారం చేస్తూ కస్టమర్లపై బూతులతో విరుచుకుపడడంతో వీరిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రముఖ రియాల్టీ షో బిగ్ బాస్‌లో అలేఖ్య చిట్టి, రమ్య సిస్టర్స్‌లో ఒకరికి ఛాన్స్ వస్తుందనే వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. బిగ్ బాస్ సీజన్ 9 త్వరలోనే కొన్ని నెలల్లో ప్రారంభం కానుండగా.. ప్రతి ఏడాది ఆగస్ట్ లేదా సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ప్రోగ్రాం స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో కంటెస్టెంట్స్ ఎంపిక, బిగ్ బాస్ ప్రోగ్రాం నిర్వహణ పనుల్లో టీం ఉంది. సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన వారికి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు బిగ్ బాస్ ఎంట్రీ దక్కుతుంది. 'అలేఖ్య చిట్టి పికిల్స్' సిస్టర్స్‌పై మీమ్స్, ట్రోల్స్, వీడియోలు 100 మిలియన్స్‌కు పైగా వీడియోలతో ట్రెండ్ అవుతున్నాయి. దీంతో వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయని నెట్టింట చర్చ సాగుతోంది. అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్‌లో రీల్స్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న రమ్యకే ఆ అవకాశం ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. మోడ్రన్ డ్రెస్సుల్లో ఆమె చేసిన రీల్స్ ఎక్కువగా ట్రెండ్ అవుతుండడమే దీనికి కారణమని చెబుతున్నారు. తాజాగా, జియో హాట్ స్టార్‌లో పికిల్స్‌కు సంబంధించి ఓ సీన్ సైతం వీడియో షేర్ చేశారు. ప్రభాస్ ఛత్రపతి సినిమాలో ఓ సీన్‌తో వీడియో విడుదల చేశారు. తాజాగా, బిగ్ బాస్ ఆదిరెడ్డి కూడా తన యూట్యూబ్ ఛానల్‌లో ఈ విషయంపై స్పందించారు. వారిలో ఒకరు బిగ్ బాస్‌కు రావొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజమండ్రి వేదికగా 'అలేఖ్య చిట్టి పికిల్స్' పేరుతో ముగ్గురు సిస్టర్స్ సుమ కంచర్ల, అలేఖ్య చిట్టి, రమ్య మోక్ష కంచర్ల (రమ్య గోపాలకృష్ణ) సోషల్ మీడియాలో పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించారు. వీరిలో రమ్య తన రీల్స్‌తోనూ పాపులర్ అయ్యారు. తమను విమర్శించిన వారిపై అంతేస్థాయిలో సోషల్ మీడియా వేదికగా విమర్శలు సైతం చేశారు. అయితే పచ్చళ్ల ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రశ్నించిన ఓ నెటిజన్‌కు వీరిలో ఓ అమ్మాయి అలేఖ్య అతనిపై బూతులతో విరుచుకుపడింది. ఈ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇదే సమయంలో తమను కూడా అలానే తిట్టిందంటూ మరిన్ని ఆడియో లీక్స్ బయటకు వచ్చాయి. దీంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లపై ట్రోలింగ్ మొదలైంది. అంత దారుణంగా ఎలా తిడతారంటూ కామెంట్స్ చేశారు. దీంతో అక్క సుమ కంచర్ల తాను తిట్టలేదని.. తనను ట్రోల్ చెయ్యొద్దని వేడుకున్నారు. ఈ అంశంపై వివాదం ముదురుతున్న వేళ అలేఖ్య ఎట్టకేలకు సారీ చెప్పారు. తాను తప్పు చేశానని.. తాను ఎవరినైతే ఇప్పటివరకూ తిట్టానో వాళ్లందర్నీ సారీ అడుగుతున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు. దీంతో ఈ వివాదానికి ఎండ్ కార్డ్ పడినట్లే అనిపిస్తున్నప్పటికీ ఇంకా ట్రోలింగ్ మాత్రం కొనసాగుతూనే ఉంది.

# జనసేన గూటికి జక్కంపూడి

రాజమండ్రి, ఏప్రిల్ 9, జక్కంపూడి కుటుంబం జనసేనకు దగ్గరవుతోందా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ కుటుంబానికి ఆదరణ తగ్గిందా? అందుకే పునరాలోచనలో పడ్డారా? వచ్చే ఎన్నికల నాటికి ఆ కుటుంబం అంతా జనసేన గూటికి చేరుతుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల జక్కంపూడి రాజా సోదరుడు గణేష్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ తో ఉన్న విభేదాలతోనే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ తెర వెనుక వేరే వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా గణేష్ ను పంపించి.. పరిస్థితి చూసి మిగతావారు జంప్ చేసేందుకు ప్లాన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

గోదావరి జిల్లాల్లో జక్కంపూడి కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు జక్కంపూడి రామ్మోహన్ రావు. కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. 1989లో కడియం నియోజకవర్గం నుంచి తొలిసారిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1994 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 1999లో కడియం నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో అదే నియోజకవర్గంలో నుంచి గెలిచిన రామ్మోహన్ రావుకు రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్లో మంత్రి పదవి దక్కింది. అయితే 2009లో అనారోగ్యంతో ఎన్నికలకు దూరంగా ఉండి పోవాల్సి వచ్చింది. రాజశేఖర్ రెడ్డి మరణంతో జక్కంపూడి కుటుంబం జగన్ వెంట నడిచింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2014లో రాజానగరం నియోజకవర్గ నుంచి జక్కంపూడి రాజాకు చాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఆ ఎన్నికల్లో రాజా ఓడిపోయారు. కానీ 2019 ఎన్నికల్లో మాత్రం రాజా గెలిచారు. అయితే రాజా సోదరుడు గణేష్ మాత్రం రాజమండ్రిలో ఉంటూ రాజకీయాలు చేసేవారు. ఆ సమయంలో ఎంపీ మార్గాని భరత్ తో ఆయనకు విభేదాలు నడిచాయి. అయితే ఈ విషయంలో మార్గాని భరత్ వైపు జగన్మోహన్ రెడ్డి బలంగా నిలబడ్డారు. 2024 ఎన్నికల్లో తనకు ఎంపీ బదులు ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని కోరారు భరత్. దీనికి జగన్మోహన్ రెడ్డి అంగీకరించారు కూడా. రాజమండ్రి సిటీ నుంచి అవకాశం ఇచ్చారు కూడా. ఇది ఎంత మాత్రం జక్కంపూడి కుటుంబానికి రుచించలేదు. అందుకే ఆ కుటుంబం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికిప్పుడు కుటుంబమంతా వేరే పార్టీలో చేరితే తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉంది. అందుకే ముందుగా గణేష్ జనసేనలో చేరుతారని తెలుస్తోంది. 2029 ఎన్నికలకు ముందు పరిస్థితుల కు అనుసరించి కుటుంబం మొత్తం ఒక నిర్ణయానికి రాబోతున్నట్లు సమాచారం. పైకి మార్గాని భరత్ తో ఉన్న విభేదాలతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పినట్లు చెబుతున్నా.. వచ్చే ఎన్నికల్లో టార్గెట్ చేసుకుని ఆ కుటుంబం పావులు కదుపుతున్నట్లు అర్థమవుతోంది. మరి మున్ముందు ఆ కుటుంబం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# తీరానికి వాడేసుకుంటున్న కూటమి సర్కార్

కాకినాడ, ఏప్రిల్ 9, (న్యూస్ పల్స్) ఏపీ సీఎం చంద్రబాబు అంది వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు సైతం ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. అటు కేంద్రం సైతం ఏపీకి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో ఇప్పటికే దూకుడుగా ఉంది ఏపీ ప్రభుత్వం. కొద్ది నెలల కిందట విశాఖ కేంద్రంగా రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ఇప్పుడు ఉత్తరాంధ్రలో నేవీకి సంబంధించి యుద్ధ నౌకల కేంద్రంతో పాటు ఆయుధ డిపో ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు అత్యంత చొరవ తీసుకుంటున్నారు. ఇండియన్ నేవీ కి భూములను కేటాయించి.. ఇక్కడ ఏర్పాటు అయ్యేలా కేంద్రాన్ని ఒప్పిస్తున్నారు. తూర్పు కోస్తాప్రాంతంగా విశాఖకు గుర్తింపు ఉంది. ఇప్పటికే నేవీ కార్యకలాపాలకు కేంద్రంగా మారింది విశాఖ నగరం. తూర్పు కోస్తా తీర పరిరక్షణకు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది మొదలు.. నావీ సేవలను విస్తృత పరుస్తూ వస్తోంది. అందులో భాగంగా దేశానికి అవసరమైన యుద్ధ నౌకల తయారీ కేంద్రం, ఆయుధ డిపోను ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి స్థలం అవసరం అని కేంద్రం కోరింది. దానికి భూమిని సమకూర్చే పనిలో పడింది చంద్రబాబు సర్కార్. ఈ రెండు ఏర్పాటు అయితే ఏపీకి జాతీయ పరంగా ప్రత్యేక గుర్తింపు దక్కినట్టే. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే అవకాశం ఉంది. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా తూర్పు కోస్తా నావికాదళం కొనసాగుతోంది. దేశంలోనే విస్తృత సేవలు అందిస్తోంది ఈ ప్రాంతీయ కార్యాలయం. ఇప్పుడు మరో ముందడుగు వేసింది. విశాఖకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంబిల్లిలో యుద్ధనౌకల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది నావికాదళం. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. దీనిపై శరవేగంగా స్పందించింది చంద్రబాబు సర్కార్. అక్కడ భూముల ఏర్పాటుకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాంబిల్లిలో 32 యుద్ధ నౌకలు నిలిపేలా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వమే ఒక పోర్టు ఏర్పాటు చేయనుంది. అదే జరిగితే భారీ ఎత్తున ఉద్యోగాల కల్పన జరుగుతుందని నావికాదళం అధికారులు చెబుతున్నారు. ఇంకోవైపు విజయనగరం జిల్లా బాడంగిలో నావికాదళానికి సంబంధించి ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో అక్కడ ఒక ఎయిర్పోర్ట్ ఉండేది. కాలక్రమంలో అది కనుమరుగయింది. కానీ ఆ ఎయిర్ క్రాఫ్ట్ భూములు మాత్రం రైతుల ఆధీనంలో ఉన్నాయి. ఒకవైపు అదే జిల్లాలోని భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ నిర్మాణం.. ఇంకోవైపు రైల్వే మార్గం.. మరోవైపు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని బాడంగిలో నావికాదళం ఆయుధం డిపో ఏర్పాటుకు దేశస్థాయి అధికారులు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే చంద్రబాబు సర్కార్ తీర ప్రాంతాన్ని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు వినియోగించుకుంటోంది. ఇప్పటికే విశాఖను పర్యాటకంగా, పారిశ్రామిక హబ్ గా మార్చేందుకు చంద్రబాబు సర్కార్ కృత నిశ్చయంతో ఉంది. ఐటీ పరంగా చాలా సంస్థలను ఇక్కడ నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలు అంతర్జాతీయ సంస్థలు సైతం తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధపడుతున్నాయి. ఒకవైపు పారిశ్రామికం, ఇంకో వైపు ఐటి, మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో విశాఖ దేదీప్యమానంగా వెలగనుంది. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల సరసన చేరనుంది.

# కాంగ్రెస్ పార్టీ పదవి వ్యామోహ పిశాచి...

ప్రజాబలం ప్రతినిధిజగిత్యాల ప్రధాని మోదీ పదవి వ్యామోహ పిశాచి అని రష్యా అధినేత పుతిన్ వలే నియంతల దేశాన్ని పాలించాలని ప్రయత్నం చేస్తున్నాడని డీలిమిటేషన్ పేరుతో దేశ సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. పదేళ్లు కేంద్రంలో రాష్ట్రములో అధికారానికి దూరం కాగానే కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి రావడానికి కర్ణాటకలో ఐదు గ్యారంటీల పేరుతో తెలంగాణాలో ఆరు గ్యారంటీల పేరుతో ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయక చతికిల పడిందని అనంతరం జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో ఏడు గ్యారంటీల పేరుతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది గ్యారంటీల పేరుతో ముందుకెళ్ళితే మహారాష్ట్ర, ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్ చేతిలో గాడిద గుడ్డు పెట్టారని ఏద్దేవా చేశారు. తెలంగాణాలో ఆరు గ్యారంటీల అమలుకై ప్రశ్నించే ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నియంతలా మారి తప్పుడు కేసులు బనాయిస్తుందని అన్నారు. కానీ భారతీయ జనతా పార్టీ ఏరోజు కూడా అధికారంలోకి రావడానికి అడ్డదారులు తొక్క లేదని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలు తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని అన్నారు. మతం పేరుతో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఎనిమిది మంది ఎంపీలు గెలిచిన రాష్ట్రానికి తెచ్చిన నిధులు గుండు సున్నా అని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని అన్నారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉండడం వల్లే పది నెలల్లో 50 వేల కోట్లు నిధులు తేగలిగామని చెప్పిన విషయం పిసిసి అధ్యక్షుడు గుర్తెరగాలి అన్నారు. 11 ఏళ్ల బిజెపి పాలనలో దేశంలో ఎక్కడ కులాల మధ్య మతాల మధ్య ఘర్షణలు జరగలేదని అన్నారు.

# ప్రమాదంలో ఆరోగ్యం....

అపోలో హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా 25 లక్షల మందికి నిర్వహించిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదిక రూపొందించింది. ఎలాంటి లక్షణాలు లేకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయని పేర్కొంది. లక్షణాలు లేనప్పటికీ 26% మందికి హైబీపీ, 23% మంది మధుమేహంతో బాధపడుతున్నారు.అపోలో హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా 25 లక్షల మందికి పైగా నిర్వహించిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025 నివేదికను రూపొందించింది.

ఈ నివేదిక ఆధారంగా 'ఆరోగ్యా?న్ని మీ ప్రాధాన్యతగా మలుచుకోండి' అనే స్పష్టమైన సందేశం ఇచ్చింది. అపోలో నివేదిక ప్రకారం చాలా మందిలో ఎలాంటి లక్షణాలు కనిపించనప్పటికీ దీర్ఘకాలిక అనారోగ్య స్థితిని కలిగి ఉంటున్నారని పేర్కొంది. ఎలాంటి లక్షణాలు లేకున్నప్పటికీ 26 % మంది హైపర్‌టెన్షన్ కలిగి ఉంటే, 23% మంది మధుమేహం కలిగి ఉన్నారని గుర్తించింది.ఒకప్పుడు మద్యం తాగే వారికి మాత్రమే వచ్చే ఫ్యాటీ లివర్ ఇప్పుడు ఊబకాయం, మధుమేహం, రక్తపోటుతో ముడిపడిన ఆరోగ్య సమస్యగా మారింది. 257,199 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా... ఆశ్చర్యకరంగా 65% మందికి ఫ్యాటీ లివర్ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. కాగా వారిలో 85% మంది మద్యం సేవించనివారు కావడం గమనార్హం. సగానికి పైగా సాధారణ రక్త పరీక్షలు -అంటే సంప్రదాయ రోగ నిర్ధారణ పరీక్షలు మాత్రమే సమగ్ర వ్యాధి నిర్ధారణకు సరిపోవు.హెచ్‌ఓఎన్ నివేదిక 2025 ప్రకారం మెనోపాజ్ తర్వాత మహిళలకు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. మెనోపాజ్ కు ముందు మధుమేహం 14% మందిలో కనిపిస్తే ఆ తరువాత కాలంలో 40%కి పెరుగుతున్నాయి. ఊబకాయం కేసులు 76% నుండి 86%కి పెరిగాయి. ఫ్యాటీ లివర్ ప్రాబల్యం 54% నుండి 70%కి పెరిగింది. ఈ మార్పులు మహిళల దీర్ఘకాలిక ఆరోగ్యంపై హార్మోన్ల మార్పులు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని నివేదిక పేర్కొంది. మెనోపాజ్ కు చేరుకుంటున్న మహిళలకు చురుకైన, వ్యక్తిగత ఆరోగ్య ప్రణాళిక పాటించాలని ఈ నివేదిక చెబుతోంది.విద్యార్థులలో ఊబకాయం వేగంగా పెరుగుతోంది. ఇది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. ఈ నివేదిక ప్రకారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో 8% మంది ఇప్పటికే అధిక బరువు లేదా ఊబకాయంతో ఉన్నారు.

ఇది ప్రారంభ సూచిక మాత్రమే. కౌమారదశలో ఊబకాయ గణనీయంగా పెరుగుతుంది. ఈ సమస్య కళాశాల విద్యార్థులలో 28% కనిపిస్తోంది. జీవనశైలి, ఆహార మార్పుల ప్రభావాన్ని ఇది తెలియజేస్తుంది. అదనంగా, కళాశాల విద్యార్థులలో 19% మంది ప్రీ-హైపర్‌టెన్సివ్‌గా ఉన్నట్లు కనుగొన్నారు. గతంలో గుర్తించిన దానికంటే చాలా ముందుగానే నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి.అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీత రెడ్డి మాట్లాడుతూ, "హెల్త్ ఆఫ్ ది నేషన్ 2025 నివేదిక మనం పరిష్కరించాల్సిన కీలకమైన సమస్యలను, ముఖ్యంగా మహిళల ఆరోగ్యం, బాల్య ఊబకాయానికి సంబంధించిన సమస్యలను వెల్లడిస్తుంది. మెనోపాజ్ తర్వాత జీవక్రియ ప్రమాదాల పెరుగుదల మనకు సాధారణ ఆరోగ్య పరీక్షల కంటే మరింత ఎక్కువ అవసరమనే దానికి స్పష్టమైన సూచిక.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. మహిళలకు వారి ఆరోగ్య ప్రయాణంలోని ప్రతి దశలోనూ మద్దతును అందిస్తున్నాము. పిల్లలలో పెరుగుతున్న ఊబకాయం, ప్రీ-హైపర్‌టెన్షన్ రేట్లను కూడా ఈ నివేదిక నొక్కి చెబుతుంది. ఇది చాలా ఆందోళన కలిగిస్తుంది. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు, త్వరగా చర్య తీసుకోవాల్సిన సంకేతాలు. ఒక మార్గదర్శక సంస్థగా, దేశవ్యాప్తంగా వ్యక్తుల జీవితాల్లో, సామాజిక పరంగా మార్పు తీసుకురావాలని అపోలో నిశ్చయించుకుంది" అని అన్నారు.

రక్తపోటు నిశ్శబ్దమైనదే కానీ నిత్య ప్రమాదంగా మారుతోంది. 2024లో సుమారు 4,50,000 మంది వ్యక్తులను పరీక్షించగా, వారిలో 26% మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, ఎటువంటి లక్షణాలు లేకుండా ఉన్నారని అపోలో నివేదిక తేలింది. భారతదేశంలో హృదయ సంబంధిత వ్యాధుల భారానికి అధిక రక్తపోటు కీలక తోడ్పాటుదారునిగా నిలుస్తుంది. దీనికి సరైన చికిత్స అందడంలేదు. రక్తపోటుపై మరింత అవగాహన కల్పించాలని ఈ నివేదిక కోరుతుంది. బీపీ ఆరోగ్య సంరక్షణ ప్రక్రియలో ఒక సాధారణ భాగంగా చేయాలని పేర్కొంది.ఎలాంటి లక్షణాలు లేకుండా కరోనరీ కాల్షియం స్కోరింగ్ చేయించుకున్న వ్యక్తులలో 46% మందికి రక్త నాళాలలో కాల్షియం పేరుకుపోవటం కనిపించింది, అది అథెరోస్క్లెరోసిస్ తొలి సంకేతం. వీరిలో 25% మందికి అబ్స్ట్రక్టివ్ కరోనరీ ఆర్టరీ వ్యాధి ఉంది. ఆందోళనకరమైన అంశమేమిటంటే, రక్త నాళాలలో కాల్షియం అధికంగా ఉన్నవారిలో 2.5% మంది 40 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు. ముందస్తుగా ప్రమాదాన్ని గుర్తించడానికి కాల్షియం స్కోరింగ్, సీటీ యాంజియోగ్రఫీ వంటి అధునాతన ఇమేజింగ్ పద్ధతుల ప్రాముఖ్యతను ఈ గణాంకాలు మరింతగా వెల్లడిస్తున్నాయి. ప్రతి నలుగురిలో ఒకరికి గుండె సమస్యలు ఉన్నట్లు గుర్తించింది.భారతదేశ ప్రజారోగ్యంలో మానసిక ఆరోగ్యం చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది.

కానీ తాజా డేటా దీనిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుంది. ఖఊఖి-9 స్కేల్ ఉపయోగించి డిప్రెషన్ కోసం పరీక్షించిన 47,424 మంది వ్యక్తులలో, 7% మంది మహిళలు, 5% మంది పురుషులు క్లినికల్ గా డిప్రెషన్ సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ భారం మధ్య వయస్కులలో (40?55) గరిష్ట స్థాయిలో కనిపించింది. ఈ గణాంకాలు పెరుగుతున్న సమస్యను మాత్రమే కాకుండా, ముందస్తు జోక్యానికి ఆటంకం కలిగించే లోతైన సామాజిక అపోహలను కూడా వెల్లడిస్తున్నాయి. సాధారణ ఆరోగ్య పరీక్షలలో సమగ్ర మానసిక ఆరోగ్య అంచనాలు, డిజిటల్ మానసిక ఆరోగ్య వేదికల విస్తృత ఉపయోగం, సానుకూల, సకాలంలో సంరక్షణను అందించడానికి సామాజిక స్థాయి అవగాహన కోసం అపోలో హాస్పిటల్స్ ప్రచారం చేస్తోంది.అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా విస్మరించరాని నిద్రలేమి ది హెల్త్ ఆఫ్ ది నేషన్ 2025 నివేదిక ఆశ్చర్యకరమైన ధోరణిని వెల్లడిస్తుంది. ప్రతి నలుగురు భారతీయులలో ఒకరు అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ూూం) ప్రమాదానికి అధిక చేరువలో ఉన్నారు.

ఇది ఊబకాయం, హృదయ సంబంధ వ్యాధులు, పగటిపూట అలసటతో దగ్గరి సంబంధం ఉన్న సమస్య. దాదాపు 53,000 మంది వ్యక్తులపై నిర్వహించిన పరీక్షల ఆధారంగా, 33% మంది పురుషులు, 10% మంది స్త్రీలను అధిక ప్రమాద స్థాయికి దగ్గరగా ఉన్న వ్యక్తులుగా గుర్తించారు. వయస్సుతో పాటు ప్రమాద స్థాయిలు గణనీయంగా పెరుగుతాయి. ఇది 55 ఏళ్లు పైబడిన 68% మంది పురుషులు, 22% మంది స్త్రీలను ప్రభావితం చేస్తుంది. అధిక ప్రాబల్యం ఉన్నప్పటికీ, ూూం నిర్ధారణ తక్కువగానే ఉంది. తరచుగా సాధారణ అలసట లేదా ఒత్తిడిగా తప్పుగా భావిస్తున్నారు. జీవక్రియ పరీక్షలలో సాధారణ నిద్ర ప్రమాద అంచనాలు, ూూం లక్షణాల గురించి విస్తృత స్థాయిలో ప్రజా అవగాహన, నివారణ సంరక్షణకు అత్యంత కీలకంగా నిద్రను గుర్తిస్తూ ఆఫీస్ వెల్‌నెస్ కార్యక్రమాలకు అపోలో పిలుపునిస్తోంది. 2024లో గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణకు సగటు వయస్సు 49 సంవత్సరాలు, రొమ్ము క్యాన్సర్‌కు 57 సంవత్సరాలు, ఊపిరితిత్తుల క్యాన్సర్ 61 సంవత్సరాలుగా ఉంది. పట్టణ, గ్రామీణ జనాభాలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, అవగాహన మెరుగుపరచడం కోసం వయస్సు పరిమితిని తగ్గించాలని నివేదిక సూచించింది.భారతదేశ ఆరోగ్య సంరక్షణ విధానంలో చికిత్స నుంచి నివారణకు, లక్షణాల నుంచి డేటా ఆధారిత వరకూ ఒక నమూనా మార్పు కోసం ప్రచారం చేయటం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రోహెల్త్ ప్రోగ్రామ్ అధునాతన రోగ నిర్ధారణలు, నిపుణులైన వైద్యుల ద్వారా వెల్నెస్‌కు మార్గనిర్దేశనం, ఏఐ- ఆధారిత ప్రిడిక్టివ్ రిస్క్ స్కోర్‌లు, వ్యక్తిగత ఆరోగ్య ప్రోత్సాహకాలు, ముందస్తు జోక్యాలను మిళితం చేయటం ద్వారా దాని ప్రభావాన్ని నిరూపించింది. ఈ కార్యక్రమం కీలకమైన ఆరోగ్య కొలమానాలను వాస్తవ సమయంలో ఒడిసి పడుతుంది. ప్రతి వ్యక్తికి అనుగుణంగా కార్యాచరణ సిఫార్సులను అందిస్తుంది.

ఈ కార్యక్రమం ద్వారా 59% మధుమేహ వ్యాధిగ్రస్తులుస్థాయిలను తగ్గించుకోగలిగారని, 51% అధిక రక్తపోటు ఉన్నవారు తమ రక్తపోటును తగ్గించుకున్నారని తెలిపింది. అధిక బరువు ఉన్నవారిలో 47% మంది బరువు తగ్గించుకోగలిగారని పేర్కొంది.ఆరోగ్య ప్రమాదాలను ముందుగానే గుర్తించటం, వ్యక్తిగత ఆరోగ్య శ్రద్ధ, సంక్లిష్ట చికిత్స అవసరమయ్యే ముందు వ్యాధుల పురోగతిని తగ్గించడం ఈ కార్యక్రమం లక్ష్యం. మొత్తంమీద, హెచ్‌ఓఎన్ -2025 ఫలితాలు ప్రజారోగ్య విధానం, ఆరోగ్య బీమా కవరేజ్, నివారణ ఆరోగ్య సంరక్షణను పొందడానికి అవసరమైన కీలక అంశాలను అందిస్తున్నాయి. ముందస్తు ప్రమాద గుర్తింపు, జీవనశైలి మార్పు, రోగ నిర్ధారణలకు సమానమైన అవకాశాలలోనే ముందుకు సాగే మార్గం ఉంది.

## పవర్ కోసం ప్రతిపక్షాల పాకులాట

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** మూడేళ్లలో మేము పవర్ లోకి వస్తున్నాం?. మీ సంగతి చూస్తాం.ఇంకా నాలుగేళ్ల టైముంది. కళ్ళు మూసుకుంటే నాలుగు రోజులగా అయిపోతాయి. మళ్లీ మనమే పవర్ లోకి వస్తాం .రాగానే వాళ్ల తోలు తీస్తాను. ఆ ఎస్ ఐ పేరు గుర్తుపెట్టుకోండి?. మూడేళ్ల తర్వాత పవర్ లోకి రాగానే వాడిచేత మీకు సెల్యూట్ కొట్టిస్తా. తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య బాగా వినబడుతున్న మాటలు ఇవి. ఏపీలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిరోజు? మూడేళ్లలో పవర్ లోకి వచ్చేస్తాం? రాగానే వాడి సంగతి చూస్తాం. వీడి సంగతి చూస్తాం?. అది కట్టిస్తాం?. ఇది పడగొడతాం అని హామీల మీద హామీలు ఇస్తున్నారు.లో ఉన్న ఈ పొలిటికల్ పార్టీల ధైర్యం ఏమిటో మాత్రం ఎవరికి అర్థం కావటం లేదు. క్యాడర్ లో ఊపు తేవడానికి , నమ్మకం కలిగించడానికి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా?.? లేక అధికార పక్షాన్ని బెదిరించి? మైండ్ గేమ్ ఆడుతున్నారా అన్నది జనంలో చర్చ నడుస్తోంది. ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని అనిపిస్తే ఆ తప్పుని అడ్డుకోవడంపై విపక్షాలు దృష్టిపెట్టడం లేదు. మేము వచ్చాక అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించడం చాలా మామూలు అయిపోయింది. అంటే మూడేళ్ల తర్వాత వీళ్ళు వస్తే మళ్లీ పగ ప్రతీకారాలు కొనసాగుతాయన్నమాట.ఇప్పుడు వాళ్ళని వీళ్ళు వేసుకుంటారు. మూడేళ్ల తర్వాత వీళ్లు వాళ్ళని వెంటాడుతారు అన్నమాట. అధికారంలోకి వస్తే ఏం చేస్తాము అన్నది పొలిటికల్ పార్టీలేవి చెప్పడం లేదు. రెండు మూడేళ్లలో మేము అధికారంలోకి వచ్చేస్తున్నాం?. మేము ఆ బుక్ లో రాస్తున్నాం? ఈ బుక్ లో రాస్తున్నాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. తెలుగు రాష్ట్రాల్లో అన్ని పార్టీలు ఒక రౌడీ గ్యాంగ్ లాగా తయారయ్యాయి. అసలు వీళ్ళ కాన్ఫిడెన్స్ ఏంటో అర్థం కాదు. ముఖ్యంగా ఏపీలో జగన్మోహన్ రెడ్డి కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఆరో నెలలోనే మొదలుపెట్టేశారు. నెక్స్ట్ మనమే అధికారంలోకి వస్తాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాలు సమయం ఉంది.164 సీట్లు ప్రభుత్వానికి ఉన్నాయి. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవడికి ఏం తెలియదు. అసలు ప్రభుత్వం ఏర్పడి ఇంకా 9 నెలలు మాత్రమే అయింది. కానీ జగన్మోహన్ రెడ్డి అప్పుడే తొందరపడి పోతున్నాడు. నాలుగేళ్లలో మనమే అధికారంలోకి రాబోతున్నాం రాగానే?. వాడి సంగతి తెలుస్తాను. వీడి సంగతి తెలుస్తాను అని హెచ్చరిస్తూ ఉంటారు. ముఖ్యంగా పోలీసు అధికారుల్ని?. జగన్ పేరు పెట్టి మరి ఓ వీధి రౌడీలాగా వార్నింగ్ ఇస్తూ ఉంటారు.సరే కార్యకర్తలకు కాన్ఫిడెన్స్ నింపడానికి?. మనం అధికారంలోకి రాబో తున్నాం ధైర్యంగా ఉండండి అని చెప్పొచ్చు. ప్రభుత్వాలు నిన్ను గాక మొన్న ఏర్పడ్డాయి. ఆంధ్రాలో గట్టిగా 9 నెలలు అవ్వలేదు.అప్పుడే జగన్ 2029 లో నేనే అధికారంలోకి వస్తానని పాట పాడుతున్నాడు. ఆయనకు అంత తొందర ఎందుకో అర్థం కాదు. అధికారం లేకుండా ఉండలేకపోతున్నాడా? లేక నిత్యం భ్రమల్లో?. ఊహల్లో బతుకుతున్నాడఇక తెలంగాణ విషయానికొస్తే బి ఆర్ ఎస్ అంచనాలకు మించి ఓవర్ కాన్ఫిడెన్స్ తో ఉంది. రేవంత్ సర్కార్ వైఫల్యాలు బి ఆర్ఎస్ లో విశ్వాసాన్ని నింపేసేయ్. ఎన్నికలకు ఇంకా మూడున్నర సంవత్సరాలు సమయం ఉంది. అయినా సరే టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగలేకపోతున్నారు. అసలు రేపు ఎల్లుండో ఎన్నికలు జరిగిపోతున్నట్టతాము తిరిగి అధికార పీఠాల్లోకి ఎక్కి కూర్చున్నట్లు వీరావేశంతో హామీలు ఇస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పక్కనే ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ స్థలం విషయంలో ఒక పక్క ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం వివరణ ఇస్తుండగానే?. మరోవైపు కేటీఆర్ కాంగ్రెస్ ఏం మాయ చేసినా సరే అక్కడ స్థలాలు ఎవరూ కొనవద్దు. మరో మూడు ఏళ్లలో మన ప్రభుత్వం వస్తుంది? ఆ స్థలాన్ని మేము వెనక్కి లాక్కుంటాం అని హెచ్చరిస్తారు. ఆ 400 ఎకరాలు మన ప్రభుత్వం ఎకో పార్క్ కట్టిస్తుంది హామీ ఇచ్చేస్తారు.ఆంధ్ర, తెలంగాణలో ప్రతిపక్షాల ధైర్యం ఏంటో అర్థం కాదు. గతంలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాము. ముఖ్యమంత్రిగా పని చేసాము. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాము. మర్యాదగా మాట్లాడాలి. అన్న ధ్యాస ఏ కొసానా లేదు. మూడేళ్లలో మేం అధికారంలోకి వస్తున్నాము. నాలుగేళ్లలో పవర్ లోకి వస్తాము. వాడి తోలు తీస్తాము. వీడు తోలు తీస్తాము. ఆ బుక్ లో రాస్తున్నాము? ఈ బుక్ లో ఎక్కిస్తున్నాము?. ఇలా ఒక రౌడీ గ్యాంగులు తరహాలో హెచ్చరికలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీకార రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.దీనికి ప్రధాన కారణం ఏ ప్రభుత్వమైనా ఐదేళ్లకు మించి ఉన్నదని అందరి నమ్మకం.

వేలకోట్ల రూపాయలు అప్పులు తెచ్చి? సంక్షేమ పథకాల అమలు చేస్తూ?. ప్రజలను సంతృప్తి పరచలేక కచ్చితంగా ప్రభుత్వంలో ఉన్న ఏ పార్టీ అయినా ఐదేళ్లకు ఓడిపోక తప్పదు?. కనుక జనం ప్రచారం న్యాయంగా మళ్ళీ మనకే ఓటేస్తారు?.

అందుకే అధికారం మనకు వచ్చేస్తుంది అనే ధీమాతో?. ఓడిపోయిన మరుసటి రోజు నుంచే సిగ్గు ఎగ్గు లేకుండా మళ్లీ మనదే అధికారం అని చెప్పు తిరుగుతుంటాయి పార్టీలు. అసలు ప్రజలు మనల్ని ఎందుకు ఓడించారు?. వేరే వాళ్ళకి ఎందుకు అధికారమిచ్చారు అన్న సమీక్ష చేయకుండా? ప్రభుత్వాలకి ఏడాది నిండకుండానే వీళ్లు వచ్చే ఎన్నికల్లో మాదే అధికారంలో ప్రకటనలు చేస్తున్నారు.


## అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

నల్గొండ అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యంలో భార్యను భర్త హత్యచేసాడు. భార్య నర్స కుమారినీ భర్త సైదులు కత్తితో నరికి చంపాడు. భార్య అక్రమ సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల అనుమానం.. అడవిదేవులపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## మామిడి రైతులపై ట్రంప్ ఎఫెక్ట్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా అనేక దేశాలపై అదనపు సుంకాలు విధించడంతో పలు రంగాలు నష్టాలను చవిచూస్తున్నాయి. భారత్‌పై ట్రంప్ 26 శాతం సుంకాలు విధించడంతో మనదేశంలోని పలు రంగాలపై ప్రతికూల ప్రభావం పడింది.ఆక్వా రంగంలో రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఏపీలో రొయ్యల ధర అమాంతం పడిపోయింది. ఇప్పుడు ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం మన దేశ మామిడి పండ్లపై కూడా పడుతోంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వాటి ఉత్పత్తిలో ముందు వరసలో ఉన్నాయి.ఇరు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 7,64,500 ఎకరాల్లో సాగవుతోంది. వాటిల్లో ప్రతి ఏడాది 24,45,900 టన్నుల మామిడి పండ్ల దిగుమతి వస్తోంది. భారత్ నుంచి అమెరికాకు ప్రతి ఏడాది 45 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే 10 ? 15 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి.వాటి విలువ రూ.150 ? రూ.230 కోట్ల మధ్య ఉంటుంది. టారిఫ్‌ల పెంపుతో వాటి విలువ ఇప్పుడు మరో రూ.50 కోట్లకు పైగా పెరగవచ్చు. దీంతో అమెరికాలో భారత మామిడి పండ్ల ధరలు పెరిగి, డిమాండ్ తగ్గే ముప్పు ఉంటుంది.గతంలో అమెరికాకు మామిడి ఎగుమతులపై టారిఫ్ 0 ? 5 శాతం మధ్య కొనసాగింది. ఇప్పుడు దాన్ని 22 శాతం నుంచి 26 శాతం వరకు పెంచారు. ట్రంప్ టారిఫ్‌లతో అమెరికాకు మనమామిడి పండ్ల ఎగుమతి ధరలు పెరుగుతున్నప్పటికీ రైతులకు ఆ లాభాలు అందే అవకాశాలు అంతంత మాత్రమే.ఎందుకంటే ఎగుమతిదారులు టారిఫ్‌ల భారాన్ని రైతులపై వేయవచ్చు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోవచ్చు. అమెరికాకు ఈక్వెడార్‌తో పాటు ఇండొనేషియా తక్కువ ధరకు మామిడిని ఎగుమతి చేస్తే మన దేశ రైతులు యూఎస్‌లో మార్కెట్‌ను కోల్పోయే అవకాశం ఉంది.


## నేడు భారత మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ వర్ధంతి




మొరార్జీ దేశాయి 1896 ఫిబ్రవరి 29 న జన్మించిన భారత స్వాతంత్ర్య సమర యోధుడు,జనతా పార్టీ నాయకుడు. అతను1977 మార్చి 24 నుండి 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవలనందించాడు. అతను దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచాడు. అతను భారతదేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టాడు. వాటిలో: బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టాడు. అంతర్జాతీయంగా దేశాయ్ తన శాంతి ఉద్యమం ద్వారా కీర్తి సంపాదించాడు. అతను దక్షిణ ఆసియాలో ప్రత్యర్థి దేశాలైన పాకిస్తాన్, భారతదేశం మధ్య శాంతిని ప్రారంభించడానికి అనేక ప్రయత్నాలు చేసాడు. 1974 మే 18న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ లో జరిగిన మొదటి అణుపరీక్ష తరువాత అతను చైనా, పాకిస్తాన్ లతో స్నేహపూర్వక సంబంధాలను పునరుద్ధరించడానికి సహాయం చేసాడు. 1971లో జరిగిన భారత్-పాకిస్తాన్ ల మధ్య జరిగిన యుద్ధం వంటి అంశాలలో సాయుధ పోరాటం నివారించడానికి కృషి చేసాడు. వీరు 1995 ఏప్రిల్10 న మృతి చెందారు.

# నేడు ప్రపంచ హోమియోపతి దినోత్సవం

## –హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యేల్ హనెమన్ జయంతి




హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యేల్ హనెమన్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటారు.

హోమియోపతీ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక వైద్యవిధానం. జర్మన్ దేశానికి చెందిన డా. క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యేల్ హనెమన్ అనే ఫిజిషియన్ 1796లో ఈ వైద్యవిధానాన్ని, ఈ మాటని కనిపెట్టాడు.

మలేరియా వ్యాధి నివారణకు సంకోనబెరడుతో చేసిన మందువాడుతారని తెలుసుకున్న హనెమన్ ఆ బెరడు మలేరియాను ఏ విధంగా నివారిస్తుందో తెల్సుకోవాలనుకున్నాడు. అందుకోసం సింకోనా బెరడుతో కషాయం తయారు చేసుకొని తనమీద తన స్నేహితులమీద ప్రయోగాలు జరిపి, ఏ ఔషదమైతే ఆరోగ్యవంతునిలో ఒక వ్యాధి లక్షణాలను కలుగజేస్తుందో ఆ లక్షణాలున్న వ్యాధికి ఆ ఔషదం ఇచ్చినప్పుడు వ్యాధి నయమవుతుందని తెలుసుకున్నాడు. తన ప్రయోగ ఫలితాలను గురించి 1976లో లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించడంతోపాటు, ఈ నూతన వైద్య విధానికి హోమియోపతి గా నామకరణం చేశాడు.

ప్రస్తుతం వైద్య విధానాల్లో హోమియోపతి వైద్యం రెండవ స్థానంలో ఉంది.

1813 సంవత్సరంలో జర్మనీలో టైఫాడ్ జ్వరం వచ్చినప్పుడు హోమియోపతి వైద్యంద్వారా ఆ వ్యాధి అరికట్టబడింది.

66 దేశాల్లో ఈ హోమియోపతి వైద్యం ప్రాచుర్యంలో వుండగా, భారతదేశ జనాభాలో 38 శాతం ప్రజలు ఈ వైద్యాన్ని పొందుతున్నారు.

# చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్..

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** తెలంగాణలో మిస్ వరల్డ్ సంబరం అంబరాన్నంటేలా జరగబోతోంది. మే నెల 7వతేదీ నుంచి 31వరకు మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన వివిధ ఈవెంట్లు తెలంగాణలో జరుగుతాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మిత సభర్వాల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా.. వెల్కమ్ డిన్నర్ కి సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. చౌమహల్లా ప్యాలెస్ లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు.హైదరాబాద్ లో జరగబోతున్న మిస్ వరల్డ్ పోటీలకు 120 దేశాలకు చెందిన మోడల్స్ హాజరవుతారు.

వీరంతా మే నెల 6, 7 తేదీల్లో హైదరాబాద్ కి చేరుకుంటారు. ప్రారంభ కార్యక్రమంగా మే 7న చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, అనంతరం చౌమహల్లా ప్యాలెస్ వద్ద వెల్కమ్ డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. 120 మంది మోడల్స్ తో పాటు ఆయా దేశాలకు చెందిన 400 మంది ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు ఈ కార్యక్రంలో పాల్గొంటారు. వెల్కమ్ డిన్నర్ కి సంబంధించి చౌమహల్లా ప్యాలెస్ లో ఏర్పాటు చేయాల్సిన కార్యక్రమాలపై తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మిత సభర్వాల్, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్యాలెస్ లో ఫోటోషూట్ కోసం సీటింగ్ ఏర్పాట్లు, లైవ్ మ్యూజిక్ కాంటెస్ట్, సూఫీ మ్యూజిక్, ఖవ్వాలి మ్యూజిక్ షో ఇక్కడ నిర్వహించబోతున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 20 నిమిషాలు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల తర్వాత వెల్కమ్ డిన్నర్ ఉంటుంది. తెలంగాణ రుచులతోపాటు, నిజాం వంటకాలు, ఇతర భారతీయ రుచులు కూడా మెనూలో ఉంటాయి.ఇప్పటి వరకు భారత్ రెండుసార్లు మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది. మొదటిసారి బెంగళూరులో, తర్వాత ముంబైలో పోటీలు జరిగాయి. మూడోసారి ఈ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం విశేషం. 72వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. నెలరోజులపాటు భాగ్య నగరం సందడిగా మారుతుంది.లండన్ కి చెందిన మిస్ వరల్డ్ సంస్థ, తెలంగాణ పర్యాటక శాఖతో కలసి ఈ పోటీలు నిర్వహిస్తుంది. మొత్తం తెలంగాణలో 10వేదికలను గుర్తించగా 8 నుంచి 9 ఈవెంట్లు ఇక్కడ జరుగుతాయి. ప్రారంభ వేడుక, ముగింపు వేడుక హైదరాబాద్ నగరంలో జరుగుతాయి. మిగతా ఈవెంట్లు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో జరిపేందుకు పర్యాటక శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. పర్యాటకంగా తెలంగాణకు ఈ ఈవెంట్ మరింత పేరు తెస్తుందని అంటున్నారు అధికారులు. మిస్ వరల్డ్ పోటీలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అతిథులకు స్వాగతం, వారి బస ఏర్పాట్లు, ఈవెంట్ల కోఆర్డినేషన్, విదేశీ ప్రతినిధుల సౌకర్యాలు.. అన్నిట్లో అప్రమత్తంగా ఉంటున్నారు. నెలరోజుల ముందునుంచే ఏర్పాట్లకోసం కసరత్తులు ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రం ఆతిథ్య రంగంలో మరింత ప్రాముఖ్యత సంతరించుకునే అవకాశం ఉండటంతో ప్రభుత్వం పోటీల నిర్వహణలో చొరవ తీసుకుంది. అటు అధికార యంత్రాంగం కూడా ఈ పోటీల నిర్వహణ కోసం టీమ్ లను ఏర్పాటు చేసింది. పర్యాటక శాఖతోపాటు జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ యంత్రాంగం కూడా పోటీల నిర్వహణకోసం సమాయత్తమైంది.

# కోతులు బాబోయ్... కోతులు

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** శతమర్కటం?పితలాటకం. కోతుల యుద్ధం మనుషుల చావుకొచ్చింది. మనుషులకే కాదు మర్కటాలకు కూడా గట్టు పంచాయితీలు ఉంటాయి. నేను లోకల్ అంటూ అవి యుద్ధానికి దిగితే ఎట్టా ఉంటాదో తెలుసా? ఓ చిన్న పల్లె సాక్షిగా వేలాది కోతులు సరిహద్దు పంచాయితీపై బస్తీ మే సవాల్ అన్నాయి. ఆ యుద్ధం చూసిన ఊరు గజగజలాడిపోయింది.రెండు దేశాల మధ్య యుద్ధం కాదు. రెండు ఏరియాల కోతులు ఒకే చోట చేరితే?ఊరంతా పీకి పందిరేశాయి. మా ఏరియాలోకి వస్తారా అంటూ కొత్త కోతులపై పాత కోతుల దండు దాడి చేసింది. ఈ ఈ వానర దండుయాత్రతో ఊరంతా రణరంగంగా మారింది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్కేపల్లిలో కోతులు యుద్ధానికి దిగాయి. వందలాది కోతులు.. రెండు గ్రూపులుగా సమరమే అంటూ నానా విధ్వంసం సృష్టించాయి.వెన్కేపల్లి గ్రామంలో ఆల్రెడీ ఓ పెద్ద కోతుల గుంపు తిష్ట వేసి గ్రామస్తులను కాల్చుకు తింటోంది. వాటికి పోటీగా, అక్కడి ఆహారంలో వాటా కోసం మరో పెద్ద కోతుల గుంపు వెన్కేపల్లికి వచ్చింది. దీంతో లోకల్ కోతులు, నాన్ లోకల్ కోతుల గుంపుల మధ్య అతి భీకర యుద్ధం జరిగింది. ఒకదాన్ని ఒకటి రక్కుతూ, కోరలతో పీకుతూ, మంకీస్ గ్యాంగ్ వార్‌కి తెర తీశాయి. అవి యుద్ధం చేయడమే కాకుండా, ఇళ్లల్లోని సామాన్లను చిందరవందర చేసి పారేశాయి.మనుషుల మధ్యే కాదు.. మర్కటాల మధ్య కూడా ప్రాంతీయ ద్వేషాలు.. లోకల్, నాన్ లోకల్ పంచాయితీలు ఎలా ఉంటాయో ఈ సంఘటనను చూస్తే అర్థమవుతుందంటున్నారు గ్రామస్తులు. ఒక ప్రాంతపు కోతులు మరో ప్రాంతంలో ఆకలి దాడి చేస్తే, అక్కడి కోతులు తిరగబడ్డాయి. కోతుల గోల అండ్ భీకర యుద్ధం చూసి ఊరంతా షాక్ అయింది. వేలాది కోతులు రెండు వర్గాలుగా యుద్ధం చేస్తుంటే, గ్రామస్తులు తలుపులు వేసుకుని ఇళ్లలో దాక్కున్నారు. కాలు బయటపెట్టే సాహసం చేయలేకపోయారు. కనిపిస్తే కరిచివేత అన్నట్లు కోతులు పెట్టిన కర్ఫ్యూతో, 2 గంటల పాటు ఊరి జనం ఇళ్లకే పరిమితమయ్యారు.2 గంటల వార్ తర్వాత, రెండు గ్రూపులు యుద్ధ విరమణ ప్రకటించడంతో ఊరంతా ఊపిరి పీల్చుకుంది. ఇలా వేలాది కోతులు ఊరి మీద పడితే, తాము ఊళ్లో ఉండే పరిస్థితి లేదని వాపోతున్నారు గ్రామస్తులు. కోతుల బెడదను తొలగించాలని అధికారులను వేడుకుంటున్నారు. ఈ మంకీస్ గ్యాంగ్ వార్ చూసి గ్రామస్తులు షాక్ తిన్నారు. ఇలాంటి సంఘటన రియల్ లైఫ్‌లోనే కాదు, సినిమాల్లో కూడా చూడలేదంటున్నారు. కోతుల దాడులను అరికట్టకపోతే, తామే ఊరు ఖాళీ చేసే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు.అడవిలో ఉండాల్సిన కోతులు ఇప్పుడు గ్రానైట్ క్వారీల కారణంగా కోతులు అడవిని వీడి జనసంచారంలో చేరిపోయాయి. అవి అడవిని విడిచి చాలా ఏళ్లు గడిచింది. ఇక్కడ హంగామా చేస్తున్నాయి. గ్రూపులుగా విడిపోయి గొడవలకు దిగుతున్నాయి. రెండు గ్రూపులు కలిస్తే కిష్కింధ కాండను తలపిస్తోంది. పొరపాటున వాటిని నివారించే ప్రయత్నం చేశామో వెంటపడి మరీ పరుగెత్తిస్తున్నాయి. ఈ సమస్య ప్రతీ గ్రామంలో ఉంది. రెండు గంటల పాటు రెండు వానర గ్రూపుల మధ్య జరిగిన బీకర యుద్ధం నడి రోడ్డుపై వామ్మో అంటూ జనం పరుగులు తీశారు.

# రేపటి నుంచి 3 రోజులపాటు శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

తిరుమల ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం

ఎల్లుండి ఉదయం స్వర్ణరథంపై దర్శనమివ్వనున్న శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామి

ఈనెల12వ తేదీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులకు వసంతోత్సవ వేడుకల్లో తిరుమంజనం.ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో రేపు తిరుప్పావడ సేవ, 12వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

# పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

## – సోలార్ ప్యానల్స్ ఏర్పాటు ద్వారా ఉచిత విద్యుత్ సరఫరా
## – కిలో వాట్ కు 30 వేలు , 2 కేడబ్ల్యూ కు 60 వేలు, 3 కేడబ్ల్యూ కు 78 వేల సబ్సిడీ

పెద్దపల్లి ప్రతినిధి:పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కలిపించాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉన్నది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష దీనిపై పలు శాఖల అధికారులతో సమీక్షా జరుపుతున్న క్షేత్రస్థాయిలో ప్రజలకు దీనిపై అవగాహన శూన్యమేనని చెప్పాలి. ఈ సోలార్ విద్యుత్ ను వాడుకోవడం వల్ల అటు కరెంట్ ఉచితంగా వాడుకోవడంతోపాటు అదనంగా ఉత్పత్తి చేస్తే ఆదాయం కూడా వస్తుందనే విషయం ఎంత మంది ప్రజలకు తెలుసును అనేది ప్రశ్న. అయితే కేంద్రం రేడ్ కో ఆధ్వర్యంలో రాయితీతో కూడిన సోలార్ విద్యుత్ ను అందిస్తుండగా గతంలో పలువురు లబ్ధిదారులు పోస్టల్ శాఖ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లా నుండి ఆశించిన స్థాయిలోదరఖాస్తులు వచ్చిన, వాటికి సంబందించిన పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. కాగా మంగళవారం సోలార్ విద్యుత్ పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మరోసారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ తెలంగాణ రెడ్కో ద్వారా పీఎం సూర్య ఘర్ – ముఫ్త్ బీజ్లి యోజన పథకం అమలు తదితర అంశాలు, ఈ పథకం క్రింద ప్రజలు స్వచ్ఛందంగా ఇంటి పై రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని అన్నారు. దానికి ఇస్తున్న రాయితీలను వివరించారు. అయితే 2 కిలో వాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 150 యూనిట్ల వరకు, 3 కిలో వాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 300 యూనిట్ల వరకు ప్రతి నెలా ఉచితంగా విద్యుత్ పొందవచ్చని అన్నారు. ఇంటి పై ఏర్పాటు చేసుకునే రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ కు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, కిలో వాట్ కు 30 వేలు , 2 కే.డబ్ల్యూ కు 60 వేలు, 3 కే.డబ్ల్యూ కు 78 వేల సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ప్రభుత్వం రెడ్కో ద్వారా అందించే వివిధ సబ్సిడీలను వివిధ శాఖల అధికారుల ద్వారా సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సోలార్ ప్లాంట్ ను మన ఇంటి పై ఏర్పాటు చేసుకోవడం ద్వారా మనకు ఉచిత విద్యుత్ అందుతుందని, మన అవసరాలకు మించి అధికంగా విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో గ్రిడ్ కు విక్రయించడం ద్వారా మనకు ఆదాయం కూడా లభిస్తుందని అన్నారు. కాగా ఈ పథకం ద్వారా ప్రజలకు ఎంతో కొంత మేలు జరుగుతుందనే విషయాన్ని అధికారులు మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటే విద్యుత్ ఆదాతో పాటు అదనపు ఆదాయం వస్తుందనే విషయం తెలియజేయాలి. వివిధ మాధ్యమాలు, ప్రచార సాధనాలు ద్వారా ప్రజలకు చేర వేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

విశాఖపట్నం విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్ లో మృతి చెందిన బాలుడి బంధువులను ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కే.జి.ఎచ్ మార్చురీ వద్ద పరామర్శించారు. అనంతరం పి.విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ ?. పోర్ట్ స్టేడియం విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్ లో బాలుడు మృతి చెందిన దుర్ఘట న పై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా వాటర్ వరల్డ్ యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశా రు. పై ప్రమాద విషయాన్ని పోర్ట్ చైర్మన్ దృష్టికి, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. గతంలో పోర్ట్ స్టేడియం లో గొ కార్టింగ్ కి వెళ్లిన తన మన మరాలు రోడ్డు పై పడిపోయి 45 రోజులు మంచంపై ఉందని గుర్తు చేసుకున్నారు.అయితే ఆ సమ యంలో తమవారిదే పొరపాటు అయి ఉండొచ్చని తాను ఆ ఘటన పై స్పందించలేదని చెప్పారు. వాటర్ వరల్డ్ యాజమాన్యం సేఫ్టీ ప్రికాషన్స్ అద్భుతముగా చేస్తు న్నామని తనతో చెప్పారనీ, చిన్న పిల్లలు ఆనందంగా ఆడుకోవడానికి వస్తున్నారనీ, సరియైన జాగ్రత్తలు తీసుకోవాలని తాను వారితో చెప్పానని వివరించారు. నిన్న జరిగిన ఈ ఘటనలో చిన్నారి చావుకు కారణం విశ్వనాద్ స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యం మాత్రమేనన్నా రు. ప్రమాదం జరిగిన వెంటనే మోటార్ సైకిల్ పై ట్రీట్మెంట్ నిమిత్తం తీసుకువెళ్లగా, అప్పటికే బాలుడు మృతి చెందాడని తెలిపారు. భద్ర తా ప్రమాణాలు పాటించకుం డా, డబ్బు ఆపేక్ష లక్ష్యంగా యాజమా న్యం పసిపిల్లల ప్రాణాలతో ఆడు కుంటుందని ఎమ్మెల్యే ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో పిల్లలు మఅత్యుకూపంలోకి వెళ్లే అవకాశం ఉందని కలెక్టర్కి వెంటనే విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ మూసివేయాలని కోరారు. ఇలాంటి భద్రతా ప్రమాణాలు లేని స్పోర్ట్స్ క్లబ్ లపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. పర్యాటకుల ఆనందానికి ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించని స్పోర్ట్స్ క్లబ్ లకు వెళితే మృత్యు కుహరంలోకి వెళ్లినట్లేనని, పర్యాటకులు ప్రమాదాలకు గురి కావద్దని ఎమ్మెల్యే సూచించారు.

# మహిళా సంఘాలకు రైస్ మిల్లులు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** మహిళలు తమ కాళ్లపై నిలబడేలా ఎదిగేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇదివరకే రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సౌర విద్యుదుత్పత్తి రంగాల్లో మహిళలను ప్రభుత్వం భాగస్వాములు చేసింది. తాజాగా రైస్‌మిల్లుల పరిశ్రమలో వారికి అవకాశాలు కల్పించాలని భావించి అందుకు కార్యాచరణను ప్రారంభించింది. మహిళా సంఘాలకు తోడ్పాటు అందించేందుకు ప్రతి మండలంలో ఒక రైస్‌మిల్లు నిర్మించేందుకు సర్కార్ ప్లాన్ చేస్తోంది. ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్‌మిల్లులు ఏర్పాటు, గోదాములు నిర్మించి ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో మహిళా సమాఖ్యలు ఉన్నాయి. మొత్తం 553 మండల మహిళా సమాఖ్యలు ఉండగా.. గ్రామస్థాయిలో 18000 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. మహిళా సమాఖ్యలున్న మండలాలకు ఒక్కో రైస్‌మిల్లు చొప్పున మంజూరు చేస్తే మొత్తం 553 రైస్ మిల్లులను నిర్మించి వారికి అందించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో 4.37 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉండగా.. వాటిలో సభ్యులుగా 47.40 లక్షల మంది మహిళలు ఉన్నారు. అన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలంటే ఒక్కో ఒక్కోరై?సమిల్లుకు దాదాపు రూ. 3.50 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకు మెషినరీ మన దగ్గరే లభిస్తుంది. గంటకు 4 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న మెషీన్లు కొనుగోలు, వాటిని మిల్లులలో బిగించి అంతా సిద్ధం చేయడానికి రూ. 1.10 కోట్ల వరకు అవుతుంది. వీటికి అదనంగా మట్టిపెళ్లలు, బెరుకులను వేర్వేరు చేసి తొలగించే యంత్రాలను కల్పించడానికి మరో రూ.75 లక్షలు వెచ్చించాలి. భవన నిర్మాణం, మెషీన్లు, విద్యుత్, నీటి సరఫరా, ఇతర అన్ని సదుపాయాలతో కలుపుకుంటే ఒక్కో రైస్ మిల్లుకు రూ.3.50 కోట్ల వరకు అవుతుందని అంచనా వేశారు. ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు నిర్మించి ఇస్తామని మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో 553 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి.స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు నిధులను బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణంగా రైస్ మిల్లులు నిర్వహించే వ్యాపారవేత్తలు నాబార్డ్ నుంచి రుణాలు తీసుకుంటారు. ఇందుకోసం ఆస్తులు తనఖా పెట్టాల్సి ఉంటుంది. అయితే, మహిళా సంఘాలకు ఆ అవసరం ఉండదని, ప్రభుత్వమే మహిళలకు, బ్యాంకులకు మధ్యవర్తిగా వ్యవహరించడంతో పాటు గ్యారెంటీ కూడా ఇస్తుందట.

రైస్ మిల్లుల విషయంలో.. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాలు, ఆయా పథకాల్లో చురుగ్గా పాల్గొంటున్న మహిళా సంఘాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందట.

# సన్న బియ్యం సరఫరాకు అడ్డంకులు

**నిజామాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** తెలంగాణలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ఉగాది నుంచి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైంది. అయితే వారం రోజులైనా రాష్ట్రంలోని చాలా గ్రామాలు, పట్టణాల్లో ఇప్పటికీ పంపిణీ మొదలు పెట్టలేదు. చాలా రేషన్ షాపులు మూసివేయడం, స్టాక్ కొరత, సర్వర్ సమస్యలతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైంది. అయితే, పలు జిల్లాల్లో షాపులకు తగినంత స్టాక్(ాబినీఇఎ) చేరకపోవడంతో లబ్ధిదారులు ఖాళీ చేతులతో వెనుదిరిగారు. కొన్ని చోట్ల షాపులు తెరిచినా, సర్వర్ సమస్యల కారణంగా బియ్యం పంపిణీ ఆగిపోయింది. ఉదయం నుంచి క్యూలైన్లలో నిలబడిన పేదలు సాయంత్రం వరకు బియ్యం లేకుండా తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఈ పరిస్థితి ప్రజలలో ఆగ్రహాన్ని రేకెత్తించింది.కొన్ని రేషన్ షాపుల్లో సన్న బియ్యం సంచుల్లో నూకలు ఎక్కువగా ఉండటం, బియ్యం నాణ్యత సరిగా లేకపోవడంపై లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సన్న బియ్యం అని చెప్పి దొడ్డు బియ్యం ఇవ్వడం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. రేషన్ డీలర్లు స్టాక్ రాకపోవడం, అధికారుల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో తాము కూడా ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు.ప్రభుత్వం ఈ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతోంది. కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులు స్టాక్ సరఫరా, నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ, నిత్యావసర సరుకుల కిట్ పంపిణీ వంటి పథకాలతో లబ్ధిదారులకు మరింత సౌలభ్యం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు పేదలకు నిరాశ కలిగిస్తున్నాయి.సన్న బియ్యం పంపిణీ పథకం తెలంగాణలో పేదలకు ఊరట కలిగించాల్సిన పథకం అయినా అమలులో లోపాలు లబ్ధిదారులను కలవరపెడుతున్నాయి. స్టాక్ కొరత, సర్వర్ సమస్యలు, నాణ్యత లోపాలను అధిగమించి, పారదర్శక పంపిణీని నిర్ధారించడం ద్వారా ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని చూరగొనాల్సిన అవసరం ఉంది.

## పోలీసులకు లొంగిపోయిన 22 మంది మావోయిస్టులు

ఛత్తీస్–ఘడ్ బీజాపూర్ జిల్లా ఏఎస్పి చంద్రకాంత్, పోలీస్ అధికారుల ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు.లొంగిపోయిన మావోయిస్టులపై 26 లక్షల రూపాయల రివార్డు ఉన్నట్టు చంద్రకాంత్ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు మహిళలు ఉన్నారు. వారంతా గతంలో పలు విధ్వంసకర సంఘటనలు ప్రత్యక్షంగా పాల్గొనట్లు పోలీసులు తెలిపారు

# తెలంగాణలో ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** తెలంగాణలో రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సరికొత్త విధానం తీసుకొస్తోంది. ఇప్పటికే ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో అమలు అయిన ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయనున్నారు. 10వ తేదీ నుంచి 22 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కొత్త విధానం తీసుకొస్తారు. తెలంగాణవ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలు అందించేందు లేటెస్ట్ టెక్నాలజీ విరివిగా వాడుకోవడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇప్పటికే ఆ వ్యవస్థపై అనేక ఆరోపణలు ఉన్నందున వాటిని తొలగించి ప్రజలకు పారదర్శక సేవలు అందేందుకు ఆ విధానం తీసుకొస్తోంది. ఈ మేరకు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ మేరకు ఈ కీలక ప్రకటన చేశారు.

ఇప్పటి వరకు సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో చాలా సమయం వృథా అవుతూ వస్తోంది. ముందుగా దీన్ని తగ్గించేందుకు ప్రభుత్వనం స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తీసుకువస్తోంది. దీని వల్ల గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల?లోనే ప్రక్రియ పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల? ఉన్నాయి. ముందుగా కేవలం 22 ఆఫీసుల్లో మాత్రమే ఈ విధానం ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి అమలులోకి రానున్నట్టు ప్రకటించారు.

స్లాట్‌బుకింగ్ అమల్లోకి వచ్చే సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లు
హైదరాబాద్‌లోని ఆజంపుర, చిక్కడపల్లి
సంగారెడ్డి జిల్లా సదాశివపేట
మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్
రంగారెడ్డి జిల్లా శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట్ పెద్దపల్లి జిల్లా రామగుండం
ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం (ఖీ.ా),
మేడ్చల్ (ఖీ.ా), మహబూబ్ నగర్(ఖీ.ా), జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, నాగర్ కర్నూల్ మొత్తం 22 చోట్ల ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.

సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఒకేరోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం వస్తుంటాయి. దీని వల్లే ఎక్కువ సమయం వృథా అవుతుంది. దీన్ని నివారించేందుకు స్లాట్ బుకింగ్ ప్రక్రియ అమల్లోకి తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. దీని వల్ల ఏ సమయంలో స్లాట్ తీసుకుంటే ఆ టైంకు వచ్చే వెసులుబాటు ఉంటుందని అంటున్నారు.

రోజు వారి పని వేళలను 48 స్లాట్లుగా విభజించి ఈ విధానం అమల్లోకి తెస్తున్నారు. ప్రజలు నేరుగా "తీవణతిబబితీజీబితినీని.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తిని" వెబ్-సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్ధేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చన్నారు మంత్రి పొంగులేటి. స్లాట్ బుక్ చేసుకోనివారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాల్లో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తార?. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారని తెలిపారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి, 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాల్లో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామన్నారు మంత్రి. ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించామన్నారు. దీనివలన కుత్బుల్లాపూర్ కార్యాలయంలో 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పనిభారాన్ని ఈక్వల్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ విధానాన్ని ముందుగా రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట ? సరూర్ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేసినట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్ సైట్‌లో ఒక మాడ్యూల్‌ని ప్రవేశపెట్టామని మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం ఉంటుందని ఇది కూడా ఐచ్ఛికమేనని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజుపైన అమ్మినవాళ్ళు, కొన్నవాళ్లు, సాక్షులు మరియు సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా/భౌతికంగా సంతకాలు చేయడానికి చాలా సమయం పట్టడం వలన దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతుంది. దీని వలన ప్రజల సమయం వృథా అవడం ద్వారా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని నివారించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామని ఈనెల చివరిలోగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఫిర్యాదులు ప్రజల నుంచి ఎక్కువగా వస్తున్నాయని, దీన్ని నివారించడానికి చట్టాన్ని సవరించబోతున్నామని తెలిపారు. డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివిధ రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలను సవరించుకున్నాయని, అదే విధంగా తెలంగాణలో కూడా చట్టసవరణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22కి సవరణ చేస్తూ సెక్షన్ 22-బి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

# హరిత హారం వెనుక హరిత విధ్వంసం

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** హెచ్సియూ భూముల్లో అడవుల విధ్వంసం జరుగుతోందని, వన్య ప్రాణులను నిలువునా చంపేస్తున్నారు అంటూ బీఆర్ఎస్ నేతలు కన్నీళ్లు కారుస్తున్నారు. ఈ విషయంలో ముందు కాంగ్రెస్ కాస్త వెనుకబడినా.. ఇప్పుడు మాత్రం బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో జరిగిన విధ్వంశాలను బయటకు లాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి నియోపోలిస్ వరకు హరిత హారం నుంచి కాంక్రీట్ జంగిల్ వరకు గులాబీ పార్టీ పాలనలో జరిగిన కృత్రిమ ప్రకృతి విపత్తు అంటూ కౌంటర్ లు ఇవ్వడం మొదలుపెట్టింది. 2014 మరియు 2023 మధ్య లక్షలాది చెట్లను నరికివేసినప్పుడు ఎందుకు మౌనంగా ఉంది గులాబి పార్టీ అంటూ కాంగ్రెస్ మండిపడుతోంది. హరిత హారం పేరుతో అడవులను పెంచాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం దాదాపు 10,000 కోట్ల రూపాయలు వెచ్చించినప్పటికీ, తెలంగాణలో లక్షలాది చెట్లను నాశనం చేసినట్టు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. 2015 నుండి 2022 వరకు, కేసీఆర్ సర్కార్ హరితహారం కార్యక్రమం కింద 219 కోట్ల మొక్కలు నాటినట్లు పేర్కొంది, దీని కోసం 9,777 కోట్లు ఖర్చు చేసారు. ఇందులో గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి 5,006.82 కోట్లు, అటవీ శాఖ నుంచి 2,567.12 కోట్లు కేటాయించారు. నాటిన మొక్కలు 85% బతికాయని కేసీఆర్ అప్పట్లో వ్యాఖ్యానించారు. మరి అదే నిజమైతే, తెలంగాణ అటవీ విస్తీర్ణం 21,591 చ.కి.మీా 2014కు నుంచి 2021 నాటికి 21,213 చ.కి.మీాకి ఎందుకు తగ్గిపోయింది? అంటూ కాంగ్రెస్ నిలదీస్తోంది. 2014 మరియు 2024 మధ్య, బీఆర్ఎస్ పాలనలో 11,422.47 హెక్టార్ల అటవీ భూమి అధికారికంగా.. అటవీయేతర ప్రయోజనాల కోసం ఉపయోగించింది అప్పటి ప్రభుత్వం. అటవీ సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించి 2016 నుంచి 2019 మధ్య కాలంలోనే 12,12,753 చెట్లను నరికినట్టు కాంగ్రెస్ సాక్ష్యాలతో సహా బయటపెడుతోంది. ఇక కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేయగా.. ఇప్పుడు అది ఏ ఉపయోగం లేకుండా ఆగిపోయింది. ఇక ఇందుకోసం 8,000 ఎకరాల్లో అడవిని నరికేశారు. 2016-2019 మధ్య కాలంలో మొత్తం 12 లక్షలకు పైగా చెట్లను గులాబి పార్టీ హయాంలో నరికినట్టు కాంగ్రెస్ మండిపడుతోంది. అప్పుడు లేని పర్యావరణ ప్రేమ, అప్పుడు లేని అడవి జంతువులపై ప్రేమ ఇప్పుడు ఎందుకు అంటూ నిలదీస్తోంది. అటవీ సంరక్షణ చట్టం ఉల్లంఘనలను కేంద్ర ప్రభుత్వం సైతం ధృవీకరించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆగిపోయినా సరే ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క నిరసన కార్యక్రమం చేపట్టలేదు. దాని గురించి మీడియాతో మాట్లాడింది లేదు.. సోషల్ మీడియాలో పోస్ట్ లు లేవు. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. నిజంగా పర్యావరణవేత్తలమా లేక ట్రెండింగ్ లో ఉన్న అంశాల విషయంలోనా ఆలోచించుకోవాలని సూచిస్తోంది. 2014 నుంచి 2023 మధ్య కాలంలో 4,28,437 ఎకరాల భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం విక్రయించింది. కోకాపేట్‌లో, 1 ఎకరం 100 కోట్ల వరకు విక్రయించారు. ఝఎఎఅ మరియు ఊఓఆం ఆధ్వర్యంలో వేలం ద్వారా 31,000 కోట్ల రూపాయలను ఆర్జించారు. అప్పుడు పర్యావరణంపై ఈ స్థాయిలో హడావుడి జరగలేదు. పర్యావరణంపై ప్రేమ తప్పు లేదని.. మనం చేసింది ఒప్పు.. రాజకీయ ప్రత్యర్థులు చేసేది తప్పు అని మాట్లాడటం దారుణం అనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినపడుతోంది. ఏఐ వీడియోలు, ఫోటోలతో మాజీ ఐటి మంత్రి చేసే పోస్ట్ లు ఆపాలని.. కల్వకుంట్ల కుటుంబ బినామీలు హైదరాబాద్ లో కట్టిన భవనాలలో కొండలను తొలగించిన విషయాన్ని గుర్తు పెట్టుకుని మాట్లాడితే మంచిదని కాంగ్రెస్ హెచ్చరిస్తోంది.

# కవితక్క..దీక్షల అర్ధం ఏమిటీ...



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9,** ప్రతిపక్షంలో దీక్షలు.. అన్నేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు కవితక్క? ఇటీవల కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ వివిధ రకాల ఆందోళనలు చేపట్టారు. రైతుల కోసం సన్నచిలక మిర్చి దండలతో, మహిళల కోసం పోస్ట్‌కార్డ్ ఉద్యమంతో, లేదా హస్తకళాకారుల కోసం ఎండిన పంటలతో ఆమె నిరసనలు దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆందోళనలు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతులు, మహిళలు ఇతర వర్గాలను విస్మరిస్తోందని ఆరోపిస్తూ జరిగాయి. తాజాగా ఆమె అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని దీక్ష చేపట్టారు. ఇందిరా పార్కు ఎదుట దీక్ష చేపట్టారు. ఆశ్చర్యం ఏమిటంటే.. నాడు సీఎంగా కేసీఆర్ ధర్నా చౌక్ ఎత్తివేయాలని ఆదేశించారు. విపక్షాలు, కార్మిక సంఘాలు కోర్టుకు వెళ్లి ధర్నా చౌక్ సాధించుకున్నాయి. ఇప్పుడు అదే ధర్నా చౌక్‌లో కవిత ధర్నా చేయడం గమనార్హం. అయితే ధర్నాలు, దీక్షలు ఇప్పుడు చేస్తున్న కవిత.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తిగా పరిష్కరించలేదన్న ప్రశ్నలకు కారణమవుతోంది. బీఆర్ఎస్ తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉంది. అయినా కవితప్రస్తుతం ప్రశ్నిస్తున్న ఒక్క పని కూడా చేయలేదు. అయినా నాడు కవిత ఈ అంశాలపై తండ్రిని, అన్నను ఎప్పుడూ ప్రశ్నించలేదు. సామరస్యంగా అయినా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించలేదు. నాడు అధికారాన్ని అనుభవించి.. ప్రతిపక్షంలోకి రాగానే సమస్యలు గుర్తుకురావడమే ఆశ్చర్యంగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కవిత చేస్తున్న ఆందోళనలు, బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలోపేతం చేయడానికి, ప్రజల్లో కాంగ్రెస్ అసంతృప్తిని రేకెత్తించడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తున్నాయి. అయితే, గతంలో అధికారంలో ఉన్నప్పుడు సాధించలేని కొన్ని సమస్యలపై ఇప్పుడు నిరసనలు చేయడం ప్రజల్లో సందేహాలను రేకెత్తిస్తోంది. ఉదాహరణకు, రైతులకు గిట్టుబాటు ధర కోసం ఇప్పుడు ఆందోళన చేస్తున్న కవిత, అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్యను ఎందుకు పూర్తిగా పరిష్కరించలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కల్వకుంట్ల కవిత రాజకీయ జీవితం సాంస్కృతిక, సామాజిక, రాజకీయ కార్యక్రమాలతో నిండి ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు బంధు, కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి పథకాలు రాష్ట్రానికి గుర్తింపు తెచ్చాయి. అయితే, కుటుంబ పాలన, స్థానిక సమస్యల పరిష్కారంలో లోపాలు, యువతకు ఉద్యోగ అవకాశాల కొరత వంటి విమర్శలు కూడా ఎదురయ్యాయి. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ చేస్తున్న ఆందోళనలు రాజకీయ వ్యూహంగా ఉపయోగపడినప్పటికీ, గత పాలనలోని లోటుపాట్లను ప్రజలు గుర్తు చేస్తున్నారు. కవిత ఈ విమర్శలను అధిగమించి, ప్రజల విశ్వాసాన్ని పొందడానికి ఆమె ఆందోళనలు ఆచరణీయ పరిష్కారాలతో కూడి ఉండాల్సిన అవసరం ఉంది.

# చింతమనేనికి ఘనస్వాగతం



దెందులూరు మండలం పోతునూరు పంచాయతీ ఉండ్రాజవరం గ్రామంలో బుధవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పర్యటించి గ్రామంలోని పలు చోట్ల సిసి రోడ్లు నిర్మాణం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసారు.

ఈ సందర్భంగా ఉండ్రాజవరం గ్రామానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి దెందులూరు మండల పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) ఆధ్వర్యంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు..భారీ గజమాలలతో, పూల జల్లులతో, మహిళల మంగళ హారతులతో తమ అభిమాన నాయకుడు చింతమనేని ప్రభాకర్ కి కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఆత్మీయ స్వాగతం పలికారు...

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించండి

**షాద్ నగర్ లో రోడ్డెక్కిన అధికార కాంగ్రెస్ పార్టీ**
**ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం**
**చౌరస్తాపై ఆందోళన చేపట్టిన షాద్ నగర్ కాంగ్రెస్ శ్రేణులు**






దేశవ్యాప్తంగా పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు షాద్ నగర్ లో రోడ్డెక్కారు. షాద్ నగర్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పెంచిన డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను తగ్గించాలని షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య కూడలిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు నాగమణి, కాంగ్రెస్ గిరిజన నేత రఘు నాయక్, చెన్నయ్యలు మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్య తరగతి వర్గాలపై సిలిండర్ ధరను రూ.50 పెంచి భారం మోపడం సరైంది కాదన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, నేతలు రఘు నాయక్, అగ్గనూర్ బస్వనీ, ఇబ్రహీం, గూడ వీరేశం, అమేర్, విజయ్ కుమార్ రెడ్డి, వీరేశం, జ్మమద్ ఖాన్, అందే మోహన్ ముదిరాజ్, మదన్ మోహన్ రెడ్డి, అన్వర్, సందీప్ గౌడ్, నాగమణి, కృషావేణి, వర్ష గౌడ్, ముబారక్ అలీ ఖాన్,ఖదీర్, శ్రీధర్, రవితేజ, అర్జున్ లక్ష్మన్, అనిల్ సత్తయ్య, చంద్రశేఖర్ అప్ప, ప్రదీప్, మధు, నీళ్ల రవీందర్ గౌడ్, సత్తయ్య, సాయి, జగదీశ్, కరుణాకర్, నక్క బలరాజ్, దిలీప్,వాసు,వంశీ గౌడ్,,తదితరులు పాల్గొన్నారు.

# తుక్కు దుకాణాలో కార్మికుడి మృతి కుటుంబాన్ని ఆదుకోవాలి




పరవాడ మండలం పరవాడ ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్లో తుక్కు దుకాణంలో ఫార్మా పరిశ్రమలకు చెందిన వ్యర్థ రసాయనిక డ్రమ్ములను క్లీన్ చేస్తున్న సందర్భంలో తీవ్ర అస్వస్థతకు గురై బుచ్చయ్యపేట మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన పడాల హరనాథ్ (24) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఫార్మా డ్రమ్ములను తుక్కు దుకాణానికి సరఫరా చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు సంఘటనా స్థలాన్ని బుధవారం గని శెట్టి పరిశీలించారు. యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘించి సరఫరా చేయడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబానికి ఏ ఫార్మా యాజమాన్యం అయితే తుక్కు దుకాణానికి డ్రమ్ములు సరఫరా చేసిందో ఆ యాజమాన్యం చెల్లించాలని గని శెట్టి డిమాండ్ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు ఇలాంటి వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాలని గని శెట్టి డిమాండ్ చేశారు

# నెంబర్ వన్ శ్రీధర్ రావు మీద భూ కబ్జా కేసు

హైదరాబాద్ వాల్గోన్స్టా సంస్థ సీఈఓ గుంటి శ్రీధర్ రావు అలియాస్ నెంబర్ వన్ శ్రీధర్ రావుపై భూకబ్జా కేసు నమోదయింది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 చెక్ పోస్ట్ సమీపంలో రూ.12 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా చేసినట్లు ఆరోపణ. 288 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించినట్లు పిర్యాదు. తనకి కర్ణాటక సీఎం తో పాటు అనేక మంది సీఎం లతో స్నేహం ఉందంటూ రెవెన్యూ అధికారులను దబాయించినట్లు సమాచారం. అక్రమణలను కూల్చివేసి నెంబర్ వన్ శ్రీధర్ రావు తో పాటు కాంట్రాక్టర్ మీద షేక్ పేట తహశీల్దార్ అనితారెడ్డి. ఫిర్యాదు చేసారు. దాంతో జూబ్లీహిల్స్ పోలీసులు పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసారు. ప్రముఖులతో ఫోటోలు..ఖరీదైన కార్లలో తిరిగే శ్రీధర్ రావు.తన కార్లకు నెంబర్ వన్ పెట్టుకోవడంతో నంబర్ వన్ శ్రీధర్ గా ప్రచారం పోందారు.

# అంతా జగన్నాటకమే..
## – హెలికాప్టర్ వివాదంపై హోం మంత్రి ఫైర్



విశాఖపట్నం, ఏప్రిల్ 9: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు 11 సీట్లతో తీర్పిచ్చినా సిగ్గు రాలేదా అంటూ ఫైర్ అయ్యారు. గతంలో ఐపీసీ కన్నా వైసీపీ కోడ్ అమలైందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్మోహన్ రెడ్డికి అక్కడి పరిస్థితుల దృష్ట్యా 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామన్నారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని తెలిపారు. వీఐపీని తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందని... వీటన్నింటి పైన విచారణ కొనసాగుతుందని తెలిపారు.

మాట్లాడితే లా అండ్ ఆర్డర్ లేదు లా అండ్ ఆర్డర్ లేదు అంటున్నారని.. గతంలో చంద్రబాబు బయటికి రాకుండా అడ్డుకున్నారని.. ఎయిర్‌పోర్టుల్లో గుండాలను పెట్టి, అడ్డుకున్నారని గుర్తుచేశారు. పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారని.. ఇలాంటివన్నీ చేసింది జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కస్టోడియల్ టార్చర్ అనేది జగన్మోహన్ రెడ్డి సంస్కృతి అని.. తమది కాదని స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించినందుకు తమ మీద అనేక మంది మీద కేసులుపెట్టారన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని.. కానీ ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని చెప్పారు. ఇవ్వాల్సిన భద్రత కన్నా ఎక్కువ భద్రత ఇస్తున్నామని వెల్లడించారు.

పోలీసుల బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరియైనదేనా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో 2526 హత్యలు జరిగాయని.. అక్కడికి వెళ్తామన్నా కూడా.. తాము ప్రొటెక్షన్ ఇస్తామని తెలిపారు. ఎవరైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా తగిన విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హోం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్వయంగా మీటింగ్ పెట్టి.. పార్టీ నిర్ణయాన్ని, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని.. ఎవరు బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత గుర్తు చేశారు.

# పెండింగ్ చలానాలు చెల్లించాలి



ఏలూరు జిల్లా వాహనాలకు పెండింగ్లో ఉన్న చలానాలను వెంటనే చెల్లించాలని ఏలూరు ట్రాఫిక్ సి లక్ష్మణరావు సూచించారు. ఈ మేరకు ఏలూరు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు కొన్ని వాహనాలకు చలానాలు పెద్ద మొత్తంలో పెండింగ్ ఉన్నాయని వాటిని గుర్తించి చలానాలను చెల్లించే ప్రక్రియలో భాగంగానే ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ట్రాఫిక్ సిఐ తెలిపారు. చెల్లించని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు . ఈ తనిఖీల్లో ఆయనతోపాటు ట్రాఫిక్ సార్జెంట్ వెంకటేష్ ఉన్నారు

# లేడీస్ హాస్టల్లో దొంగోడు

మధురానగర్ లేడీస్ హాస్టళ్లలోకి ఓ దొంగోడు జొరబడ్డాడు. అర్ధరాత్రి దాటాక రెండు లేడీస్ హాస్టళ్లోకి దర్జాగా జొరబడి యువతుల ల్యాప్టాప్లతో పాటు విలువైన వస్తువులు చోరీ చేసి వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం మహబూబాబాద్కు చెందిన సింధు(29) నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ.. మధురానగర్లోని శ్రీ సాయి సద్గురు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో గత ఐదేళ్ల నుంచి ఉంటుంది. తన బ్యాగులో ల్యాప్టాప్, ఏటీఎం కార్డ్, ఆధార్ కార్డ్, మరికొన్ని సర్టిఫికెట్లు దాచుకుని నిద్రపోయింది. సోమవారం అర్ధరాత్రి దాటాక 3 గంటల సమయంలో ఓ దొంగ లేడీస్ హాస్టల్లోకి ప్రవేశించాడు. బ్యాగును చోరీ చేసి అక్కడి నుంచి ఉడాయించాడు. తెల్లారక చూసుకుంటే తన బ్యాగ్ కనిపించకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే ఏపీ మంగళగిరికి చెందిన యువతి కె.మనస్వి (24) నగరంలో సాఫ్ట్వేర్ ఇంజనీర్గా పనిచేస్తూ మధురానగర్లోని రామిరెడ్డి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో నివాసం ఉంటుంది. సోమవారం రాత్రి హాస్టల్లోని రూమ్లో మనస్వి గాఢనిద్రలో ఉన్నప్పుడు ఓ దొంగ జొరబడ్డాడు. ల్యాప్ టాప్, ఛార్జర్, విలువైన వస్తువులను బ్యాగులో దాచుకుంది. మనస్వి నిద్రలోకి జారుకున్నాక ఆమె రూమ్లోకి దొంగ జొరబడి బ్యాగును అపహరించి పరారయ్యాడు. రెండు హాస్టళ్లలో చోరీ చేసి బ్యాగులతో దొంగ ఉడాయించడం అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఓ లేడీస్ హాస్టల్లో వాచ్మెన్ లేకపోవడం.. మరో హాస్టల్లో వాచ్మెన్ ఉన్నా అతను నిద్రపోవడంతో దొంగకు అడ్డంకులు లేకుండా పోయాయి. లాభాపేక్షతో హాస్టళ్లను నిర్వహిస్తూ భద్రతను గాలికొదిలేశారని బాధిత యువతులు వాపోయారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కిషన్ నాయక్ కు సర్పంచుల నివాళి

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది, మహబూబాబాద్ కు చెందిన మాజీ సర్పంచ్ భర్త కిషన్ నాయక్ అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతని ఆత్మహత్య ప్రభుత్వం అత్యనే అని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ ఆరోపించారు. కిషన్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని హైదరాబాద్ గన్ పార్క్ ,అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జేఏసీ చైర్మెన్ యాదయ్య గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించక, చేసిన అప్పుల వడ్డీరేట్లు కట్టక మాజీ సర్పంచులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తూ... అభివృద్ధి పనుల కోసం లక్షలు అప్పుగా తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసిన సర్పంచులు పిట్టలుగా రాలిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. చనిపోయిన కిషన్ నాయక్ కు కోటిరుపాయల ఎక్స్ గ్రేషియా ఇచ్చి , పెండింగ్ లో ఉన్న లక్షల నగదు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

## బాకీ వసూళ్లకు కిడ్నాప్ చేసారు.

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫైనాన్స్ వ్యాపారి అరాచకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన ఈ నెల 6 న జరిగింది. ఓల్డ్ సిటీ ప్రాంతానికి చెందిన ఫైనాన్సర్, సయ్యద్ ఖురేషి అనే వ్యక్తికి 13 లక్షల రూపాయల డబ్బులు ఇచ్చాడు. అవి తిరిగి ఇవ్వడం లేదని దానికి సంబంధించి మీతో మాట్లాడాలని మొన్న రాత్రి ఖురేషిని గుడిమల్కాపూర్ పిల్లర్ నెంబర్ 55 వద్దకు రావాలని కోరాడు. ఖురేషి ఓల్డ్ సిటీ నుండి పిల్లర్ నంబర్ 55 వద్దకు రాగా ఖురేషిని బెదిరించి కారులో ఎక్కించుకొని అక్కడినుండి పాడి షరీఫ్ వైపుకు వెళ్లారు. వేగంగా వెళ్తున్న కారు పహాడీ షరీఫ్ వద్ద బోల్తా కొట్టగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా కిడ్నాప్ భాగోతం బయటపడింది.పహాడీ షరీఫ్ పోలీసులు గుడిమల్కాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగ ప్రవేశం చేసిన గుడిమల్కాపూర్ పోలీసులు నలుగురి కిడ్నాపర్ల లో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం ఆ ఇద్దరిని రిమాండ్కు తరలించారు. అబ్దుల్ రెహమాన్ నహీం, సౌత్ బిన్ సైది అనే ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్కు తరలించారు.

# అత్యంత పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు

తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావెరి సమావేశ మందిరం నందు ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజి ఒ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. తరువాత మంత్రి మీడియాతో మాట్లాడారు.

2014-19 మధ్య ప్రజలకు ఇబ్బంది లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశాం. 2019- 24 మధ్య కాలంలో ఐదేళ్లు ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి.. మద్యం వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. కొత్త పాలసీ పేరుతో వ్యవస్థ మొత్తాన్ని విచ్చిన్నం చేశారు. రాష్ట్రంలోని డిస్టిలరీల నుండి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకున్నారు. ఎన్ ఫోర్సు మెంట్ లేకుండా చేసి మద్యం అక్రమ వ్యాపారాలకు తెరలేపారని అన్నారు.

మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి, జే బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారు. జగన్ రెడ్డి అమలు చేసిన మద్యం విధానంతో ప్రభుత్వ ఆదాయం.. ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏపీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా పెరిగింది. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగగా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం తీవ్రంగా కోల్పోయాం. జే బ్రాండ్ల కారణంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడగా, వేలాది మంది కిడ్నీ, లివర్ సమస్యలతో ప్రాణాలు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ ద్వారా జే బ్రాండ్లకు స్వస్తి పలకడం జరిగింది. 6 రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టాం అత్యంత పారదర్శకంగా డిప్ నిర్వహించి మద్యం షాపుల్ని కేటాయించాం. పారదర్శక లైసెన్స్ కేటాయింపు కారణంగా సుమారు 90వేల దరఖాస్తులు రాగా, రూ.1800 కోట్ల ఆదాయం వచ్చింది. పాత బ్రాండ్లను తిరిగి పునరుద్ధరించాం. ప్రజలకు ఆరోగ్యం.. ప్రభుత్వానికి ఆదాయం కాపాడే విధంగా పాలసీని తీసుకొచ్చాం. 350కి పైగా బ్రాండ్లు ఏపీలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం మద్యం ధరలను కూడా పొరుగు రాష్ట్రాలతో సమానంగా చేయడం వలన అక్రమ రవాణా ఆగింది. గతంలో ఉన్న బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకోవడంతో దాదాపు నిర్మూలించాం. గత ఐదేళ్లు ఎక్సైజ్ శాఖను విచ్చిన్నం చేసి ఎస్ఈబీ ఏర్పాటుతో ఎన్ఫోర్స్మెంట్ కూడా సరిగా లేకుండా పోయింది. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం. మొన్నటి వరకు గంజాయి అక్రమ రవాణా కారణంగా యువత జీవితాలు చిత్తయ్యాయి గంజాయి నిర్మూలన కోసం హోమ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేసుకున్నాం. టూరిజం పెంపు కోసం 3స్టార్ హోటల్ కి లైసెన్స్ ఫీజు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నాం. గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి 32 వేల కోట్ల అప్పులు చేశారు. గత ఐదేళ్ల అక్రమాల గురించి ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారని అన్నారు.

# ప్రభుత్వ బడులలోనే విద్యార్థులను చేర్పించండి
## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పిలుపు




జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని కాటారం మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యంగా జయశంకర్ భూపాలపల్లి విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ఈరోజు కాటారం మండలంలోని కాటారం గ్రామంలో గౌరవ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంబించి, ర్యాలీని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు అమ్మ ఆదర్శ పాఠశాలలనే పథకం ప్రవేశపెట్టి పాఠశాలల్లో మౌలిక వసతుల సదుపాయాలను కల్పనకు కోట్ల రూపాయలను వెచ్చించి ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకను అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని తెలుపుతూ విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ముందుకు రావాలని ఉపాధ్యాయులంతా కలిసి ఉద్యమంలా ఈ బడిబాట కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల లోపల ప్రజల లోపల విశ్వాసాన్ని నమ్మకాన్ని కల్పించేందుకు కృషి చేయాలని కోరారు రాష్ట్రంలో వినూత్నంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ చేపట్టిన ఈ బడిబాట కార్యక్రమం చాలా అభినందనీయమని జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు ఈ బడిబాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచుకునే బాధ్యత తీసుకోవాలని కోరారు.. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ముద్దమల్ల రాజేందర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అంటే తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించడం కొరకు ముందస్తుగా ఈ బడిబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని,అన్ని పాఠశాల హెడ్మాస్టర్ లతో నిన్ననే సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించాల్సిందిగా సమాచారాన్ని అందించి, ఈరోజు ఎంతో ప్రతిష్టాత్మకంగా జిల్లాలోని అన్ని గ్రామాలలో అన్ని పాఠశాలల్లో ఈ యొక్క బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించామని, ఈరోజు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మన జిల్లాకు రావడం, బడిబాట కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం చాలా శుభ సూచకమని తెలిపారు.. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు, హెడ్మాస్టర్లు,విద్యార్థిని తల్లిదండ్రులు యువకులు, శ్రేయోభిలాషులు అందరూ ఒక ఉద్యమంలా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ కార్యాలయ అధికారులు అకాడమిక్ మానిటరింగ్ అధికారి కాయిత లక్ష్మణ్ ,సెక్టోరియల్ అధికారులు దుప్పటి రాజగోపాల్ , సి ఎం ఓ సామల రమేష్, జిసిడిఓ శైలజ, మరియు డీసీఇబీ అసిస్టెంట్ సెక్రటరీ కిషన్ రెడ్డి లతో పాటు మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి , కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఉమారాణి , లతోపాటు గ్రామ పరిధిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్పర్సన్ లు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి
## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లియాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.

బుధవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో రెవెన్యూ, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, సహకార, వ్యవసాయ, డిఆర్డీఏ, తూనికలు కొలతలు, కార్మిక శాఖల అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిఏసిఎస్, ఐకెపికి కేటాయించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించాలని సూచించారు.ఏ గ్రేడ్ రకానికి 2320, బి గ్రేడ్ రకానికి 2300 మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 శాతం కొనుగోలు కేంద్రాలు మహిళా సమాఖ్యలకు కేటాయించాలని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామ సమాఖ్యలకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పనకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయాల్లో పాటించాల్సిన నియమ, నిబంధనల యొక్క బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులకు నగదు చెల్లింపు కొరకు కొనుగోలు వివరాలు ఎప్పటి కపుడు ట్యాబ్‌లలో నమోదులు చేయాలని కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నీడ కొరకు షామియానా, తాగునీరు, ప్యాడి క్లీనర్, మాయిశ్చర్స్, తూకపు యంత్రాలు, టార్పాలిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖ అధికారిని ఆదేశించారు. సన్నరకం, దొడ్డు రకం విడి విడిగా కొనుగోలు చేయాలని, గుర్తించడానికి వీలుగా మార్కింగ్ చేయాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లింపు ఉంటుందని తెలిపారు. అన్ని కేంద్రాల వివరాలు యాప్ లో రిజిస్టర్ చేయాలన్నారు. ధాన్యం వచ్చిన సెంటర్లలో ఏఈఓలచే టోకెన్ తీసుకొని వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## కార్మికుల సంక్షేమ ఖజానా నుండి ప్రైవేట్ ఏజెన్సీల దోపిడిని అరికట్టాలి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** లేబర్ కార్డు ఉన్న భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ చెకప్, రక్త పరీక్షల పేరిట గ్రామాలలో వైద్య బృందాన్ని నిలిపివేయాలని భవన నిర్మాణ రంగం సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో బుధవారం కార్మికులకు చేపట్టిన వైద్య పరీక్షలను వారు అడ్డుకున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత కొన్ని నెలల నుంచి భవన నిర్మాణం లేబర్ కార్డు ఉన్న కార్మికులకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షల పేరిట వైద్య బృందాలు గ్రామాలలో తిరుగుతూ కార్మికులను అనేక రకాలుగా ప్రలోభ పెట్టి, మసి పూసి మారేడు కాయ మాటలు చెప్పి మీరు రక్త పరీక్షలు చేసుకోవాలని, వ్యక్తిగతంగా ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నారు అన్నారు.

రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డులో కార్మికుల సంక్షేమానికి వినియోగించవలసిన నిధులను ఈ రకంగా రక్తపరీక్షల పేరిట ఒక్కొక్క కార్మికునికి పరీక్షలు జరిపి దాదాపు 3500/- రూపాయల ఖర్చు చూపించి, కార్మికులకు హెల్త్ చెకప్ చేశామని చెప్పి, కార్మికుల నిధులను బిల్లుల రూపకంగా పే చేసుకుని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వాలు కార్మికులకు చెందాల్సిన నిధులను రాష్ట్ర లేబర్ డిపార్ట్మెంట్ కొన్ని హెల్త్ సంస్థలతో కుమ్మక్కై ఈ రకంగా కార్మికులకు మోసం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు సంక్షేమ బెనిఫిట్ పెంచాల్సింది పోయి ఉన్న నిధులను కాజేయడానికి ఇలా అడ్డదారిలో కార్మికుల కు రక్త పరీక్షల పేరిట దోపిడీ చేస్తున్నారన్నారు. దీన్ని పూర్తిగా రాజన్న సిరిసిల్ల జిల్లా భవన నిర్మాణ రంగ సంఘం సిఐటియు తీవ్రంగా తప్పుపడుతుంది అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వైద్య పరీక్షల పేరిట జరుగుతున్న అక్రమాలను ఇప్పటికైనా మానుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మికులను కూడగట్టుకుని కలెక్టర్ కార్యాలయం ముందు, హెల్త్ చెకప్ పేరిట జరుగుతున్న దోపిడిని అరికట్టడానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత,కలిసికట్టుగా పోరాడుదాం రాజ్యాంగాన్ని కాపిడుదాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పింగళి రమేష్






**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 09 :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చివరి రోజు లక్షెట్టిపేట మండలంలోని కొత్తూరు,ఎల్లారం గ్రామాలలో పెద్ద ఎత్తున్న ప్రజల తో జై బాపు,జై భీమ్,

జై సంవిధన్,రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ముందుగా ఈ రెండు గ్రామ లలో జాతీయ జెండాను ఎగురా వేసి పాదయాత్ర ను ప్రారంభించారు,మండల అధ్యక్షులు పింగళి రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత,కలసికట్టుగా పోరాడుదాం.రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నాము,అని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు.మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు,గత వారం రోజుల నుంచి లక్షెట్టిపేట మండలంలో అన్ని గ్రామాల ప్రజలకు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ సహకరించిన్నందుకు అందరికి ధన్యవాదములు అని తెలిపారు,తర్వాత ముగింపు సందర్భంగా సీనియర్ నాయకులకు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండ బుచ్చన్న జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచందర్ రావు,చెల్ల నాగభూషణం,చింత అశోక్ కుమార్ జిల్లా ఆర్ టి ఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్, లక్షెట్టిపేట మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్,మార్కెట్ కమిటీ డైరెక్ట్ ర్ తోట రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేలా రాజు,జిల్లా అధికార ప్రతినిధి బియ్యల తిరుపతి, కంది మోహన్,గుండ శ్రీనివాస్,సురేష్ నాయక్ అన్నం చిన్నాన్న, కొత్తూరుఎల్లారం గ్రామ నాయకులు కార్యకర్తలు యువ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన ఎం. పి, ఎమ్మెల్యే



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 9:**మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లు భూమి పూజను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రజలకు వసతి హక్కు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మొదటి దశగా పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మాణం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు విశ్వసనీయంగా, నాణ్యమైన నివాస వసతులు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, ఎంపీలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బాలశక్తి కార్యక్రమం అమలు తీరుపై విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులతో ఆమె జూమ్ కాల్ మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,బాలశక్తి కార్యక్రమాన్నీ పక్కాగా అమలు చేయాలనీ ఆదేశించారు. విద్యార్థులందరికీ దశలవారీగా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర ఆరోగ్య కార్డులను తయారు చేయాలని సూచించారు.వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతుల వివరాలు, అవసరమైన ప్రత్యేక పోషక ఆహారం, మందులను వారి పోషకులకు అందజేయాలని ఆదేశించారు.విద్య, వైద్యం, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా క్విజ్ పోటీలను నిర్వహించాలన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులకు జీవితంలో ఉపయోగపడే పలు కోర్సులను నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలని, ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు,విద్యశాఖ అధికారులు సలోమి కరుణ,లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు జై భీమ్ – జై బాపు జై – సంవిధాన్

### –ఎం.పి, ఎమ్మెల్యే గడ్డం వంశీకృష్ణ, వివేక్ వెంకటస్వామి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 9:**ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు జై భీమ్ జై బాబు జై సంవిధాన్ పాదయాత్ర చేపట్టినట్లు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి లు అన్నారు. మందమర్రి పట్టణంలో బుధవారం జై భీమ్ %–% జై బాపు %–% జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిలు పాల్గొన్నారు. ముందుగా

గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎం. పి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ పార్లమెంట్‌ను బీజేపీ నియంతృత్వ శైలిలో నడుపుతోందని విమర్శించారు. పార్లమెంటు లో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మాట్లాడే హక్కును బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని మండి పడ్డారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు రాజ్యాంగానికి నష్టం కలిగించే కుట్రని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికే ఈ పాదయాత్ర చేపట్టామని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత పార్టీ శ్రేణుల మీద ఉందన్నారు. నరేంద్ర మోదీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి స్పష్టంగా ఉందన్నారు. చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మందమర్రిని పట్టించుకోలేదని మున్సిపాలిటీలో అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.




ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సైడ్ డ్రైన్లు, రోడ్లు, కరెంట్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మందమర్రి మున్సిపాలిటీకి తాగునీటి ఎద్దడి సమయంలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్యాంకర్ల ద్వారా నీరు అందించామన్నారు. కాకా వెంకటస్వామి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు 24 కోట్లతో గోదావరి నీటి పథకం కోసం కృషి చేసిన విషయం గుర్తు చేశారు. పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ 30 కోట్లతో అమృత్ స్కీమ్ కింద తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చారని వివరించారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ 10 లక్షలకు పెంచడం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందించే అవకాశం కల్పించామన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం అందించటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయం అని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, బండి సదానందం, పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, పుల్లూరు లక్ష్మణ్, సంఘీ సంతోష్ , మెండే భాస్కర్, పైడిమల్ల నర్సింగ్, నెరువట్ల శ్రీనివాస్, రాకం సంతోష్, గట్ల సారంగపాణి, ఎండి జావిద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## బి సి వసతి గృహం ఆకస్మిక తనిఖీ



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 09 :** ప్రభుత్వ బిసి బాలికల కళాశాల వసతి గృహం మంచిర్యాల నందు బీసీ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.తిరుపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి విద్యార్థులతో మాట్లాడుతూ...మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.వసతి గృహ పరిసరాలను పరిశీలించారు.విద్యార్థులకు ప్రభుత్వం తరఫున అందుతున్న సౌకర్యాల వివరించారు.వసతి గృహ నిర్వహణ పై పలు సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎ.పురుషోత్తం సంబందిత అధికారాలు పాల్గొన్నారు. అనంతరం తిరుపతి ని సన్మానించారు.

## సన్న బియ్యం లబ్ధిదారులు ఇంట్లో మధ్యాహ్న భోజనం చేసిన డీసీసీ అధ్యక్షులు





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** రాష్ట్ర ప్రభుత్వం సంపన్నులతో సమానంగా పేద మధ్యతరగతి ప్రజలకు కూడా సన్న బియ్యం ఉచితంగా అందిస్తుందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం చింతల్ చందా గ్రామం ఎస్సీ కాలనీలో బుధవారం సన్న బియ్యం లబ్ధిదారులు తాండ్ర వసంత రాజేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు సన్న బియ్యం పథకంపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. సన్న బియ్యం పథకంలో పేదలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు.పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ కాలనీలో మహిళలతో మాట్లాడారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్,మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గా భవాని,వ్యవసాయ కమిటీ ఉపధ్యక్షులు ఈటల శ్రీనివాస్,నిర్మల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నందెడపు చిన్ను,గాజుల రవి కుమార్ తదితరులు ఉన్నారు

## వైఎస్ జగన్ క్షమాపణ చెప్పాలి

విజయవాడ మంగళవారం అనంతపూర్ జిల్లా లో మాజీ సీఎం వై ఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రం గా ఖండిస్తున్నామని పోలిస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాస్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి గా వున్నా మిరే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. కేవలం ఇది రాజకీయ మైలేజీ కొరకు జగన్ ఉగిపోతున్నట్టు అనిపిస్తుంది. పోలీస్ డ్రెస్ ఒక ఉక్కు కవచం లాంటిది రాజ్యాంగ హక్కును కాపాడేది. పోలీస్ ఉద్యోగం చేయడం సామాన్య విషయం కాదు. మిరే ఇలా మాట్లాడుతుంటే శాంతి భద్రతలు ఎక్కడనుండి వస్తాయి. తీవ్ర ఒత్తిడికి గురై వారానికి ఒక పోలీస్ మరణిస్తున్నారని అన్నారు.

పోలీస్ బట్టలు ఉడదీసి ఏమి చూద్దామని, జగన్ పోలీసులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. కచ్చితం గా దీనిపై న్యాయ పోరాటం చేస్తాం . శాంతిభద్రతల వైఫల్యం అనే విమర్శలు అర్ధరహితం. పోలిసులు అంటే ప్రజా రక్షణకు ఉక్కు కవచం. పోలీసులను బట్టలుడదీస్తాం అనడం ఎంత వరకు సమంజసం. 1200 నుంచి 1300కి ఒక పోలీస్ ఉన్నారు. పని ఒత్తిడీతో వారానికి ఒక పోలీసు మరణిస్తున్నారు. ఏమి చూడాలని పోలీస్ బట్టలు ఉడదీయలని అంటున్నారు. జగన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్. మమ్మల్ని గౌరవించకపోయినా పర్లేదు.. కించపరిచి మాట్లాడకండని అన్నారు.

సంఘం నేత భవాని మాట్లాడుతూ పోలీస్ శాఖలో మహిళా ఉద్యోగులు కూడా ఉన్నారు. బట్టలు ఉడదిస్తానని అనడం కరెక్ట్ కాదు. ఐదు వేల మంది మహిళా పోలీసులు ఉన్నారు.. జగన్ అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి. చట్టపరంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## రెండు సంవత్సరాల లోపు చిన్నారులలో ఆటిజం లక్షణాల ప్రారంభ సంకేతాలను గుర్తించడం అత్యంత ఆవశ్యం

### – ప్రపంచ ఆటిజం అవగాహనా నెల (ఏప్రిల్) సందర్భంగా రెండు సంవత్సరాల లోపు చిన్నారుల పెరుగుదలలో అభివృద్ధిపై ఉచిత స్క్రీనింగ్, కౌన్సిలింగ్




**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**హైదరాబాద్: ఆటిజం అవగాహనా నెలను (ఏప్రిల్) పురస్కరించుకుని, హైదరాబాద్‌లోని అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ (అనన్య సిడిసి) రెండు సంవత్సరాల లోపు చిన్నారుల పెరుగుదలలో అభివృద్ధిపై ఉచిత స్క్రీనింగ్ మరియు తల్లిదండ్రులకు, కేర్ టెకర్స్ కు కౌన్సిలింగ్ నిర్వహిస్తోంది.

ఆటిజం సోసైటీ ఆఫ్ ఏపీ %ద% తెలంగాణ వ్యవస్థాపకురాలు, అనన్య సిడిసి డైరెక్టర్, అలాగే ఆటిజంతో జీవిస్తున్న 25 ఏళ్ల కుమారుడితో అనుభవం ఉన్న తల్లిగా మాధవి ఆదిమూలం, ఆటిజం లక్షణాలను తొందరగా గుర్తించడం ఎంత ముఖ్యమో వివరించారు. "ప్రారంభ దశలోనే స్క్రీనింగ్ మరియు జోక్యం చేసుకోవడం అన్నది పిల్లల అభివృద్ధి, జీవిత నాణ్యతకు కీలకమైనవి. గర్భదశ తొలి 1,000 రోజులు, అంటే రెండవ జన్మదినం వరకు, మానసికాభివృద్ధికి అత్యంత ముఖ్యమైన సమయం. ఈ దశలో పిల్లల ప్రవర్తనలో, వారి అభివృద్ధిలో ఏమైనా తేడాలు అనిపిస్తే వారికి సత్వరం సరైన మద్దతు, %హజూవవష్ట్ర్ష్రవతీఝజూం% (స్పీచ్ థెరపి), %హెషెబజూఫ్ఆశీఝశ్రీ% థెరపీ (ఆక్యుపేషనల్ థెరపి) ఇవ్వడం వల్ల ఆటిజం వంటి పరిస్థితులపై గణనీయమైన ప్రభావం చూపించవచ్చు.

అనన్య సిడిసి తల్లిదండ్రులు, సంరక్షకులు, వైద్య నిపుణులు, మరియు ఉపాధ్యాయులను అభివృద్ధి దశలు మరియు ముందస్తు జోక్యపు అవసరంపై మరింత అవగాహన కలిగించడానికి పిలుపునిస్తోంది.

ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే భాగంగా, అనన్య సిడిసి తన ప్రాముఖ్యత కలిగిన ప్రోగ్రాం "న్యూరోనర్చర్" ద్వారా పిల్లల అభివృద్ధిపై బేరీజు వేసేందుకు వారికి ఉచిత స్క్రీనింగ్ మరియు తల్లితండ్రులకు కౌన్సిలింగ్ అందిస్తోంది. ఈ కార్యక్రమం తల్లిదండ్రులకు తమ పిల్లల అభివృద్ధికి ముందస్తుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది.

నా 26 ఏళ్ల కుమారుడు వరుణ్‌కు తల్లిగాను, అనన్య సిడిసి స్థాపకురాలిగాను, ఆటిజం లక్షణాలను ముందస్తుగా తెలుసుకోవడం మరియు తగిన సమయానికి అందించే మద్దతు ఎంత ప్రభావశీలమో నేను ప్రత్యక్షంగా అనుభవించాను అని మాధవి అన్నారు. ఈ ఆటిజం అవగాహనా నెలలో, పిల్లల అభివృద్ధి స్క్రీనింగ్‌పై అవగాహన పెంచడానికి, అపోహలను తొలగించడానికి మరియు తల్లిదండ్రులు తొందరగా మార్గనిర్దేశం పొందేలా ప్రోత్సహించడానికి మనం కృషి చేద్దాం. సమయానికి జోక్యం తీసుకోవడం ద్వారా పిల్లలు విజయవంతంగా ఎదగగలరు అని ఆమె తెలిపారు.

ఉచిత అభివృద్ధి స్క్రీనింగ్ %ద% అపాయింట్‌మెంట్ వివరాల కోసం, దయచేసి సంప్రదించండి:

o91 9848513192బీ %contact@asap.org.in; www.asap.org.in

## చలివేంద్రాన్ని ప్రారంభించిన.. కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**కూకట్పల్లి (ప్రజాబలం)ఏప్రిల్ 09:** కూకట్పల్లి 124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని రాంకీ జోనల్ ఇంచార్జ్ రవి నాయక్ తో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ వేసవిలో డంపింగ్ యార్డ్ కార్మికుల సామాన్య ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఎండలకు ఇబ్బంది పడకుండా తమ యొక్క దాహాన్ని తీర్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అందరికి సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, వాలి నాగేశ్వరరావు, శివ కృష్ణ,ఎస్.ఆర్.పి గోపాల్ నాయల్, డంపింగ్ ప్రెసిడెంట్ డి.కృష్ణ, ఎం.అంజి, ఏ. జయన్న,జి.ఎస్ మల్లికార్జున, టి.రవీందర్, ఎం.నాగరాజు, ఎం.రంగస్వామి, ఎం.మహేష్, ఎం.నారాయణ,శివ, శ్రీను, జి.ఎచ్.ఎం.సి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పుల్కల్ మండలంలో వాల్టా చట్టం నిబంధనలు ఉల్లంఘన మళ్లీ మొదలైన మొరం మట్టి దంగా




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 9, (ప్రజాబలం )** అందోల్ నియోజకవర్గం లోని ఉమ్మడి పుల్కల్ మండలంలో యదేచ్ఛంగా మోరందందా సాగుతున్న మండలంలో తెలిసి చూసి, చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు, తాడ్దాన్ పల్లి చౌరస్తా జాతీయ రహదారి 161, హైవే పైన కొనసాగుతున్న, మట్టి మొరం రావానా గత రెండు రోజులుగా , రాత్రుల్లో యదేచ్ఛంగా కొనసాగుతున్న అక్రమ మొరం మట్టి రవాణా, ఇంతకు ఈ మట్టి రవాణా దొంగలకు, ఆ షాడోస్ ఎవరు వీరి వెనుక ఉన్నఅసలుసూత్రధారుదారుల, బాగోతం త్వరలో వెలుగులోకి రాబోతుంది, మొరం మట్టి అక్రమ రవాణాను కట్టడి చేయడంలో అధికారుల వైఫల్యం వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్న అధికారులు...

## శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజున వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్ధోగా కళ్యాణ మహోత్సవంలో బిజెపి మండల ఉపాధ్యక్షులు మల్యాల రాజు గౌడ్ ఆహ్వానం మేరకు బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి హాజరై శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శనం చేసుకొని, గౌడ కులస్తులకు, చెక్కపల్లి గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఉపాధ్యక్షులు దానే తిరుపతి, స్థానిక బూత్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, బిజెపి నాయకులు లింగంపల్లి వెంకటేష్, మల్లారం తిరుపతి, సందే సారీ మల్లికార్జున్, నందగిరి రాహుల్ గౌడ్, జంగం వంశీ, లింగంపల్లి కిషోర్, జంగం నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ...బండి రమేష్



**కూకట్పల్లి (ప్రజాబలం) ఏప్రిల్ 09:**ప్రతి పేదవాడికి ప్రాణమైన ఆహారాన్ని అందించాలని లక్ష్యంతో సన్న బియ్యం పథకం ప్రారంభించబడిందని ఇది దేశంలోనే మొట్టమొదటిది అని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి పేదవాడి ముఖంలో ఆనందం వ్యక్తమవుతోంది అన్నారు.సన్న బియ్యం లబ్ధిదారుడు బాలనగర్ కు చెందిన రవి ముదిరాజ్ ఆహ్వానం మేరకు బుధవారం బండి రమేష్ తో పాటు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు రవి గృహంలో సన్న బియ్యం భోజనాన్ని చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి ,శ్రీకాంత్ పటేల్, శివకుమార్ గౌడ్ , మధుసూదన్,లక్ష్మయ్య, శివ చౌదరి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## "భారత వాహిణి" మొబైల్ యాప్ ను ఆవిష్కరించిన కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి వర్యులు, మరియు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్



ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ....

ఆధునిక సమాజంలోని యువతీ యువకులకు సనాతన ధర్మంలోని ఎన్నో సూక్ష్మ విషయాలను వివరాత్మకంగా అందించటానికి ప్రారంభించిన ఈ "భారత వాహిణి మొబైల్ యాప్" హిందూ బంధువులందరికీ సనాతన ధర్మాన్ని గురించి తెలుసుకోవటానికి

మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని అన్నారు.

ఈ సందర్భంగా... భారతి సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్. శివ సుబ్రహ్మణ్యం గారు మాట్లాడుతూ... సనాతన హిందూ సంప్రదాయంలో భాగమై ఈ ఆధునిక సమాజానికి తెలియని, 50 మందికి పైగా... భారతీయ ఋషి శాస్త్రవేత్తల చరిత్రలతో పాటు, భగవద్గీత 18 అధ్యాయాలు, వాల్మీకి రామాయణం – 07 కాండలు, మహా భారతం – 18 పర్వాలు మరియు అష్టాదశ పురాణాలు, హిందూ దేవీ దేవతల MP3 స్తోత్రాలు

ఈ "భారత వాహిణి" మొబైల్ యాప్" లో అందుబాటులో ఉన్నట్లుగా తెలిపారు.

అలాగే, యాభైకి పైగా, యోగాసనాల వివరణ మరియు ప్రాక్టీస్ వీడియోలు,

అలాగే, అనేక వ్యాధుల నివారణకు ఉపయోగపడే ఆయుర్వేద చిట్కాలు ఈ

"భారత వాహిణి మొబైల్ యాప్" లో పొందుపరచినట్లుగా తెలియచేసారు.

తెలుగు, ఇంగ్లీష్, హిందీ, కన్నడ మరియు తమిళ భాషలలో ఈ "భారత వాహిణి మొబైల్ యాప్" ను ఉపయోగించవచ్చని, ఈ భారత వాహిని మొబైల్ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ నుండి ఇన్ – స్టాల్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## సిరిసిల్ల మానేరు వాగులో చెక్ డ్యాం పునర్నిర్మించాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### దెబ్బతిన్న కరకట్టను ఈ.ఎన్.సీ శంకర్ తో కలిసి పరిశీలన



**రాజన్న సిరిసిల్ల జిల్లా , ఏప్రిల్ -09(ప్రజా బలం ప్రతినిధి)**సిరిసిల్ల మానేరు వాగులో దెబ్బతిన్న చెక్ డ్యాంను పునర్నిర్మించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల పట్టణ సమీపంలోని మానేరు వాగులో సాయిబాబా ఆలయం సమీపంలో దెబ్బతిన్న చెక్ డ్యాంను కలెక్టర్, ఈఎన్ సీ శంకర్ తో కలిసి బుధవారం పరిశీలించారు. వెంటనే పునర్నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. మానేరు బ్రిడ్జి నుంచి సాయి బాబా ఆలయం వరకు మూడు కిలోమీటర్ల పొడవు కరకట్ట పునర్నిర్మాణాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈ.ఈ.లు అమరేందర్ రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని రౌడీ షీటర్లకి సీఐ కౌన్సెలింగ్



**కూకట్పల్లి (ప్రజాబలం) ఏప్రిల్ 09:** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు బాలానగర్ సీఐ నర్సింహా రాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. రానున్న వేడుకల దృష్టిలో ఉంచుకొని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో ఉన్న 5 మంది రౌడీషీటర్లకు సస్పెక్ట్ షీటర్లకు బాలానగర్ పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వీరిపై పోలీసు నిఘా కూడా ఉందని పేర్కొన్నారు. వచ్చే వేడుకలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని, హుందాగా జీవించాలని సూచించారు. నేరస్తుల తొందరపాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, భవిష్యత్తును, కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని మారండని రౌడీ షీటర్లకు సీఐ హితవు పలికారు. ఇందులో ఎస్ఐలు రాంనారాయణ్, సరితా రెడ్డి, వినోద్ సిబ్బంది పాల్గొన్నారు.

# మందమర్రిలో మెగా రక్తదాన శిబిరం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 9:** మందమర్రి ఏరియాలోని స్థానిక సింగరేణి వృత్తి శిక్షణా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ గాజర్ల దేవేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా నూతనంగా ఉద్యోగం పొందిన కార్మికులు మరియు వివిధ గనుల డిపార్ట్మెంట్ నుంచి అధిక సంఖ్యలో కార్మికుల వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారని అన్నారు. బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం 40వ రక్తదాన శిబిరం అని అన్నారు. ఇప్పటివరకు మందమర్రి ఏరియా నుండి 2856 యూనిట్లను మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ గుండేటి శంకర్ గారిని ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. మందమర్రి ఏరియా తరపున ఎల్లప్పుడూ తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరాల నిర్వహించి వారికి అండగా ఉంటామని అన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంస పత్రాలను ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం విజయ్ ప్రసాద్, ఏఐటియుసి మందమర్రి బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, వృత్తి శిక్షణ మేనేజర్ శంకర్, ట్రైనింగ్ అధికారి అశోక్ కుమార్, హెడ్ ఓవర్మెన్లు రాజేశం, రఘువరన్, గురుమూర్తి,పీ.హెచ్.సి వైద్యులు రమేష్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జవాబుపత్రాల మూల్యాంకనం పారదర్శకంగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09 :** 10వ తరగతి పరీక్షల సంబంధిత జవాబు పత్రాల మూల్యాంకనం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల కార్మల్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి మూల్యాంకనం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...10వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో ఉపాధ్యాయులు,సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని,ఎలాంటి పక్షపాతం చూపకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో 10వ తరగతి పునాది వంటిదని,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వ్యవహరించాలని తెలిపారు.అనంతరం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఆర్.డి.ఓ.శ్రీనివాసరావుతో కలిసి 163జి జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను పరిశీలించారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకరిస్తాం, చెరువు సరిహద్దు నుంచి పైప్ లైన్ వేయండి.

## గుడి చెరువు పరిధిలోని భూ యజమానుల ఆక్రందన.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రాజన్న ఆలయ సుందరీకరణ పనులలో భాగంగా వేములవాడ పట్టణంలోని మురుగునీరు గుడి చెరువులోకి వెళ్లకుండా చేపడుతున్న పైప్ లైన్ నిర్మాణం తో తమ విలువైన నివాస గృహాల భూముల సముదాయాలను కోల్పోతున్నామని భూ యజమానులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. తామరందరికీ పట్టా పాస్ బుక్కులు ఉన్నాయని, పట్టా భూముల నుంచి పైప్ లైన్ వెళ్లకుండా స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రస్తుతం ఉన్నటువంటి గుడి చెరువు సరిహద్దు నుంచి పైప్ లైన్ తీసుకు వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలని భూ నిర్వాసితులు కోరారు. అయితే ప్రభుత్వం తీసుకువచ్చిన ఎఫ్ టి ఎల్ తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని భూ నిర్వాసితులు వాపోయారు. వెంటనే మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ విప్ స్పందించి గుడి చెరువు ప్రక్కన ఉన్నటువంటి భూ యజమానులకు న్యాయం చేయాలని భూ నిర్వాసితులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాముల కృష్ణయ్య, ఈర్నపల్లి రాజు,ఫస్సి, లాల నర్సింగం, రామారావు, తదితర భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# బిజెపి ఆవిర్భావ, అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పార్టీ సమావేశం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజున వేములవాడ అర్బన్ మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ, అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుర్రం వానిపల్లి గ్రామంలో మండల పార్టీ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి హాజరై పార్టీ సిద్ధాంతాలు, పార్టీ ఆవిర్భావ అవశ్యకత, పార్టీ కార్యకర్తలు 45 సంవత్సరాల కాలంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, మరియు పార్టీ అంచే లంచలుగా ఎదిగిన విధానం, పార్టీ నిర్మాణం, దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, చరిత్రత్మక విజయాలు లాంటి పలు విషయాలను కార్యకర్తలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు జింక శ్రీనివాస్, తిప్పర వేణి రాజు, ఏరుగొక్కుల రమేష్, కార్యదర్శులు కొలనూరు సంజీవ్ రెడ్డి, బూర శేఖర్, అధికార ప్రతినిధి విశ్వనాథం శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు గడ్డి ప్రశాంత్, కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె భాస్కర్, దళిత మోర్చా అధ్యక్షులు గంట మహేష్, యువమోర్చా అధ్యక్షులు నాంపల్లి అరవింద్, జిల్లా నాయకులు గుండెకార్ల లక్ష్మణ్, పోచంపల్లి భాను, బూత్ అధ్యక్షులు తునికి మహేష్, జక్కుల మధు, గాండ్ల తిరుపతి, చింతకుంట నరసయ్య, ముడికే రాములు, ముడికే శ్రీనివాస్, చొక్కాల ప్రశాంత్, నాంపల్లి తిరుపతి, జ్వాల లక్ష్మారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ బాల్ తలకు తగిలి బాలుడు మృతి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలో క్రికెట్ ఆడుతుండగా క్రికెట్ బాల్ తలకు తగిలి దారం అశ్విత్ రెడ్డి(10) అనే బాలుడు మృతి చెందాడు.

గురువారం రోజున స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడిన అశ్విత్ రెడ్డి శుక్రవారం యధావిధిగా పాఠశాలకు వెళ్లాక తీవ్రంగా తలనొస్తుందని ఉపాధ్యాయులకు తెలిపారు. ఇట్టి విషయమై వెంటనే అశ్విత్ రెడ్డి తల్లిదండ్రులకు సమాచారం అందించగా, తండ్రి శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రికి తరలించడంతో బాబుకు తలలో రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించి అత్యవసర వైద్య సేవ నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

అశ్విత్ రెడ్డి చికిత్స పొందుతూ మంగళవారం కరీంనగర్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగారావు పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి గత పది సంవత్సరాలుగా వేములవాడలో మెడికల్ షాప్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుమారుడు అశ్విత్ రెడ్డి మృతితో కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది.

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మైక్రో ఫైనాన్స్ బ్యాంకులు.

## డబ్బులు కట్టండి మళ్లీ లోన్ ఇస్తామంటూ మోసం చేసిన ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ బ్యాంక్.

## అప్పు చేసి మరీ డబ్బులు కట్టాం, లోన్ ఇవ్వండి అంటే, ఇవ్వడం లేదు.

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ బ్యాంకులో లోన్ ఇస్తామని చెప్పి, తీరా లోన్ కోసం వస్తే, మీరు గోల్డ్ లోన్ తీసుకున్నారు, హౌసింగ్ లోన్ తీసుకున్నారంటూ వినియోగదారులకు లోన్ ఇవ్వడం లేదు. అదే ముందు చెప్తే అయిపోతుంది కదా అని మైక్రో ఫైనాన్స్ సంస్థ అధికారులను అడిగితే, మాకేం తెలుసు అప్డేట్ ఇప్పుడే వచ్చింది, మేమేం చేస్తాం అని బ్యాంకు సిబ్బంది చెప్తున్నారు. గోల్డ్ లోన్, మరియు హౌసింగ్ లోన్ లేని వాళ్లకు అయినా లోన్ ఇవ్వండి అని మైక్రో ఫైనాన్స్ సంస్థ అధికారులను అడిగితే, అదే బ్యాంకులో లోను తీసుకున్న బాధితులతో మూడు నెలల డబ్బులు మొత్తం అడ్వాన్స్ గా కట్టించుకున్నారు. మూడు నెలల డబ్బులు మొత్తం ముందుగా కడితేనే మీకు ఫ్రెష్ గా లోన్ వస్తుందని చెప్పగా, ఆ బాధితులు డబ్బులు మొత్తం కట్టేశారు. తీరా చూస్తే సర్వర్ రావడం లేదు అని, మీ బ్యాంకు లోన్ క్లియర్ చేయలేదు అని చూపిస్తుంది, లేదా మీది పెండింగ్ అలాగనే చూపిస్తుందని బ్యాంకు సిబ్బంది చెప్తున్నారు. ఇదేంటని బ్యాంకు వారిని అడగగా మీకు దిక్కున చోట చెప్పుకోండి, పోలీస్ స్టేషన్ల లోనైనా, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలోలైన, ఇంకెక్కడైనా చెప్పుకోండి మాకు ఏమి కాదు అని బ్యాంకు సిబ్బంది చెప్తున్నారు. అందులో లోన్ తీసుకున్న బాధితులు అప్పు చేసి మరీ డబ్బులు తీసుకొని వచ్చి కట్టిన తర్వాత లోన్ ఇవ్వకపోవడంతో లోన్ బాధితులు లబోదిబోమంటూ, బాధితులు అయోమయ స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ బ్యాంకు ను బ్యాన్ చేయాలని బాధితులు కోరుతున్నారు. మా మాదిరిగా ఎవరు మైక్రో ఫైనాన్స్ బ్యాంకులో మోసపోవద్దని, బాధితులు గోడు వెళ్ళబోసుకుంటున్నారు.

# ఏసీపీ కి కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ చైర్మెన్ ఇంగిలే రామారావు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** హుజురాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ జి ని బుధవారం హుజరాబాద్ లోని ఏసిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఇల్లంతకుంట ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అపర భద్రాద్రిగా పేరు పొందిన ఇల్లందకుంట లోని సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకొని పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన ఏసిపి శ్రీనివాస్ జీ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాటు కోసం అహర్నిశలు కష్టపడ్డ పోలీసులకు తమ పాలకవర్గం నుండి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మోత్సవాల విజయవంతం కావడానికి పోలీస్ శాఖ అందించిన సహకారం మరువలేనిదని రామారావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఆలయ ధర్మకర్తలు గోడిషాల పరమేష్, గోలి కిరణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ప్రజలకు గుడ్‌న్యూస్, నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు పునఃప్రారంభం

ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు (ఆరోగ్య శ్రీ సేవలు) నేటి నుంచి యథాతథంగా కొనసాగనున్నాయి. బకాయిలు రూ. 500 కోట్ల తక్షణం విడుదలకు ఏపీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దాంతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, నెట్‌వర్క్ హాస్పిటల్స్ సమ్మె విరమించాయి. ఎన్టీఆర్ వైద్య సేవలు మంగళవారం నుంచి ఏ ఆటంకం లేకుండా కొనసాగుతాయని పేద ప్రజలకు శుభవార్త చెప్పారు. ఆశా ( యాశం) కార్యవర్గం సోమవారం నాడు రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దాంతో సమ్మె విరమిస్తున్నట్లు ఆషా టీం ప్రకటించిందిముఖ్య గమనికడా. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నుంచి హాస్పిటల్ ఎంపానెల్, నెట్వర్క్ హాస్పిటల్ బిల్లులు చేయిస్తామని, జరిమానాలు విధించకుండా, తనిఖీలు లేకుండా చూస్తామని కొంతమంది ఆగంతుకులు అధికారుల పేర్లు చెప్పుకొని హాస్పిటల్స్ వారిని సంప్రదిస్తున్నారు. దీనిపై డా. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వారు పోలీసులకి ఫిర్యాదు చేశాం. హాస్పిటల్ యజమాన్యము ఇలాంటి ఫేక్ కాల్స్ వస్తే ఈ క్రింది హెల్ప్ లైన్ నెంబర్ కు సమాచారం ఇవ్వవలసినదిగా డా. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ముఖ్య కార్య నిర్వహణాధికారి కోరారు. హెల్ప్ లైన్ నెంబర్: 9281074745

# ఈ నెల 11న అపెరల్ పార్క్ లో యూనిట్ ప్రారంభం

## హాజరుకానున్న నలుగురు మంత్రులు

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## ఏర్పాట్ల పరిశీలన, అధికారులకు పలు సూచనలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -09 (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో టెక్స్ పోర్ట్ యూనిట్ ను రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. ఈ సందర్భంగా అపెరల్ పార్క్ ను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 11వ తేదీన శుక్రవారం జిల్లా ఇన్చార్జి మంత్రి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఆయా శాఖల మంత్రులు పార్కులోనే టెక్స్ పోర్ట్ యూనిట్ ను ప్రారంభిస్తారని వెల్లడించారు. మంత్రుల రాక సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రారంభమనంతరం సభ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కావాల్సిన ఏర్పాట్లను రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ శాఖ వారు బందోబస్తు ఇతర పనులను చూసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల నాయబ్ తహశీల్దార్ విజయ్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆందోల్ నూతన తహసిల్దార్గ ఉమాశంకర్

## ఉమా శంకర్ నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు



**అందోల్ నియోజకవర్గంలో ప్రతినిధి 9,( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా,: అందోల్ మండల నూతన తాసిల్దారుగా, ఉమా శంకర్ నూతన బాధ్యతలు స్వీకరించారు, అంతకుముందు ఆందోల్ పనిచేసిన తాసిల్దార్, విష్ణు సాగర్, మానూరు మండలానికి తహసిల్దారుగా బదిలీపై వెళ్ళగా, సిర్గాపూర్ తాసిల్దార్గాపనిచేసినటువటి ఉమాశంకర్, అందోల్ మండలానికి నూతన తహసిల్దార్ గా వచ్చి, బాధ్యతలు చేపట్టారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆందోల్ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు, అలాగే ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు...

# నూతనంగా నిర్మించిన ఆయుధకారగారంను ( బెల్ ఆఫ్ ఆర్మ్స్)వర్చువల్ పద్ధతి ద్వారా ప్రారంభించిన అడిషనల్ డి.జి.పి సంజయ్ కుమార్.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్– 9 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ పోలీస్ బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన ఆయుధకారగారంను ( బెల్ ఆఫ్ ఆర్మ్స్)వర్చువల్ పద్ధతి ద్వారా ప్రారంభించిన అడిషనల్ డి.జి.పి సంజయ్ కుమార్ జైన్ ఐపిఎస్., టీ.జి.ఎస్పీ బెటాలియన్స్.ఈ కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ కు వచ్చిన డి.ఐ.జి సన్నీ కమాండెంట్ సురేష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.అనంతరం బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన దోభీ, బార్బర్ రూమ్ లను డి.ఐ.జి సన్నీ రిబ్బన్ కట్ చేసి ప్రారంబించారు.ఈ సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ...బెటాలియన్ అధికారుల,సిబ్బంది సమస్యలను యోగక్షేమాలను అడిగి తెలుసుకుని అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు.తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ క్రమశిక్షణ కలిగిన ఆర్గనైజేషన్ అని తెలిపారు. బెటాలియన్ అభివృద్ధిలో అధికారులు మరియు సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన టి.జి.యస్.పి. బెటాలియన్స్ డి.ఐ.జి. సి. సన్నీ బెటాలియన్ అధికారులు మరియు సిబ్బందిని ప్రశంసించారు.బెటాలియన్ కమాండెంట్ ఎమ్. ఐ సురేష్ మాట్లాడుతూ..అడిషనల్ డి.జి.పి సూచించినటువంటి అన్ని సలహాలు సూచనలను తప్పకుండా పాటిస్తామని తెలియజేసారు.కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులు అందించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09 :** ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు జూన్ మాసం మొదటి వారంలోగా పాఠశాలలకు కేటాయించిన మేరకు నాణ్యమైన ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, విద్యాశాఖ సమన్వయకర్త చౌదరి లతో కలిసి మండల విద్యాధికారులు, ఎ.పి.ఎం.లు,జిల్లా సమాఖ్య, మెప్మా సభ్యులతో ఏకరూప దుస్తుల తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని,ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు,వంటశాల, భోజనశాల,ప్రహారీగోడ ఇతర మౌళిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని,మే నెల 20వ తేదీ లోగా దుస్తులు సిద్ధం చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. విద్యార్థినీ,విద్యార్థులకు సంబంధించి దుస్తుల తయారీ కొరకు కొలతలు ఇప్పటికే తీసుకోవడం జరిగిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ కొరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.గత సంవత్సరం మాదిరిగా వచ్చే విద్యా సంవత్సరంలో సైతం విద్యార్థులకు ఏకరూప దుస్తులను తయారు చేసేందుకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని, కొన్ని ప్రాంతాలలో కుట్టు మిషన్లను కూడా అందించడం జరిగిందని,ఈ మేరకు సంఘాల సభ్యులు దుస్తుల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఒక జత దుస్తులకు 75 రూపాయలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మందమర్రి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద పెట్రోల్ బంక్ ఏర్పాటు కొరకు అవకాశం కల్పించడం జరిగిందని, ఏజెన్సీ ప్రాంతం అయినందున ఆసక్తి గల షెడ్యూల్డ్ తెగలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పనులు పూర్తి అయి ఎం.బి.రికార్డులు సమర్పించిన వాటికి బిల్లులు చెల్లించడం జరిగిందని,ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాలలో పనులను త్వరగా పూర్తి చేసి రికార్డులు సమర్పించాలని తెలిపారు.అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు హైదరాబాద్లో అందించిన శిక్షణకు సంబంధించిన ధృవపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్ ఎస్ యు ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** జమ్మికుంట పట్టణంలో స్థానిక గాంధీ చౌరస్తా లో ఎన్ ఎస్ యు ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇమ్రాన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎన్ ఎస్ యు ఐ సీనియర్ నాయకులు సాయిని రవి విచ్చేసి ఎన్ ఎస్ యు ఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇమ్రాన్ దివంగత ప్రధాని ఉక్కు మహిళ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఆనాడు ఇందిరా గాంధీ 1971 ఏప్రిల్ 9న విద్యార్థుల హక్కుల కోసం స్థాపించిన ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘం నేటికీ 55 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. ఎన్ ఎస్ యు ఐ స్థాపించిన అప్పటి నుండి ఇప్పటి వరకు అను నిత్యం విద్యార్థుల పక్షాన, నిరుద్యోగుల పక్షాన పోరాడుతు ఉందని మరియు పేపర్ లీక్ విషయంలో, ఫీజు రియంబర్స్ మెంట్ విషయంలో, యూనివర్సిటీ సమస్యల పై, కళాశాలలు సమస్యల పై, స్కూల్ సమస్యల పై ఎల్ల వేళల పోరాడుతు ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇమ్రాన్, కాంగ్రెస్ నాయకులు సాయిని రవి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరుషరామ్, యువజన కాంగ్రెస్ నాయకులు పర్లపల్లి నాగరాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, రాకేష్, ఎన్ ఎస్ యు ఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్,వెంకటేష్,సాయిచరణ్,శ్రీను,అలీ,షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# సృష్టిలో స్నేహాన్ని మించింది మరొకటి లేదు.



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** ఆపదలో ఉన్న తోటి మిత్రుడు కుటుంబానికి అండగా మేమున్నామంటూ తమ ఆత్మీయ ఉదారత చాటుకోవడమే కాకుండా ఆ కుటుంబానికి బాసటగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు. జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలోని పాఠశాలలో కల్లేపల్లి మురళి బాల్య మిత్రులతో కలిసి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేశాడు. తన తోటి స్నేహితులు వివిధ వృత్తుల్లో స్థిరపడి ఉండగా చిన్ననాటి స్నేహితుడైన కల్లేపల్లి మురళి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో మురళి భార్య సైతం మృతి చెందడంతో ఆ కుటుంబ పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు తమకు తోచిన విధంగా డబ్బులను జమ చేసి దాదాపు 18,500 కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేకాకుండా చిన్ననాటి మిత్రుడు పిల్లలకు తామంతా అండగా ఉన్నామని కష్ట కాలంలో ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో పాటు ఆ పిల్లలకు మార్గదర్శకం చూపే విధంగా ఆలోచనలు చేస్తూ అండగా ఉంటున్నారు. చిన్ననాటి మిత్రుడికి మేమంతా అండగా ఉన్నామంటూ చేయూతని అందించడం గొప్పదనమని స్థానికులు కొనియాడారు.

# సహపంక్తి భోజనం చేసిన కవ్వంపల్లి, సిరిసిల్ల కలెక్టర్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట,( ప్రజాబలం ),** బుధవారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో మల్లమారి భార్గవి - గణేష్ ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి మానకొండూరు శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ కలిసి సహపంక్తి భోజనం చేసినారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com